డాక్టరు సర్వేపల్లి
రాధాకృష్ణపండితుని

# "నా సత్యాన్వేషణము"

["My Search for Truth."]

స్వీయచరిత్ర

*

ఆంధ్రీకర్త:


శ్రీ బులుసు వేంకటేశ్వర్లు ఎం. ఏ.,
భారతీయతత్త్వశాస్త్ర గ్రంథానువాదకులు


*


సర్వస్వామ్య సంకలితము.



1957.


మూల్యము రు 2/-



డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణుఁడు.



శ్రీ. శే. సర్వేపల్లి శివకామమ్మగారు
( రాధాకృష్ణ సతీమణి )

# విషయసూచిక


i సంస్మరణ

ii విషయసూచిక

iii విజ్ఞప్తి

iv అనువాదకుని వాక్యములు

| | | పుట |
|---|---|---|
| ౧. | బాల్యదశ | 1 |
| ౨. | గృహజీవనము | 4 |
| ౩. | తత్త్వము : మతము | 6 |
| ౪. | జీవిత సమస్యలు | 43 |
| ౫. | టోకియో ఉపన్యాసము | 65 |

# విజ్ఞప్తి

డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల Indian Philosophy అను గ్రంథమును "భారతీయ తత్త్వశాస్త్ర"మను పేర అనువదించుటకుముందే శ్రీ బులుసు వేంకటేశ్వరులు ఎం. ఏ; గారు శ్రీ రాధాకృష్ణుల హిబ్బర్టు మహోపన్యాసములఁ గొన్నిటిని- "Idealist View of Life"ను "జీవిత పరమార్థ దృక్పథము" అను పేర- "My Search for Truth" అను గ్రంథమును "నా సత్యాన్వేషణ"మనుపేర - నిదివఱకు రచించియున్నారు. ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్ర సారస్వత ప్రపంచమున నద్వితీయస్థానము నాక్రమించిన శ్రీవారి భారతీయతత్త్వశాస్త్రమును బ్రకటించు భగీరథప్రయత్నమున నిమగ్నులమై యితర లఘుగ్రంథములఁ బ్రకటించుటలో మే ముపేక్ష వహించితిమి.

భారతీయ తత్త్వశాస్త్రమును మేము ప్రకటించుటయు, దానికి ఢిల్లీ సాహిత్య అకాడమీవారి 1953-55 సంవత్సర మహోత్తమాంధ్ర గ్రంథ బహూకృతి లభించుటయు, యావదాంధ్రజాతికిని గర్వకారణమైనది. కాలక్రమమున రాధాకృష్ణ పండితుల గ్రంథపరంపరల యాంధ్రీకృతులఁ బ్రకటింపఁ గృత నిశ్చయులమై మాచేత సిద్ధముగ నున్న "నా సత్యాన్వేషణము" నిప్పుడు ప్రకటించితిమి.

శ్రీ వేంకటేశ్వరుల వారి యాంధ్రీకరణశక్తి మేము కొని యాడఁదొడఁగుట సూర్యుని దివ్వెతోఁ జూపఁగడఁగుటయే. ఏవిధమగు ప్రతిఫలము మానుండి కోరకయే వారు రచించిన "నా సత్యాన్వేషణము" "భగవద్గీత" "జీవిత పరమార్థదృక్పథము" ప్రకటింప ననుమతి మాకొసంగిన శ్రీ వేంకటేశ్వరులు గారికి మేమెంతయో కృతజ్ఞులము. మిగిలిన రెండుగ్రంథములు, మేము త్వరలోనే ప్రకటింపఁగలమనియు నివియేకాక, మఱికొన్ని రాధాకృష్ణ కృతులను మేము ప్రకటింపనున్నారమనియు మనవిచేయుచు ఈగ్రంథపరంపర నాంధ్రు లమితముగ నాదరింతురని విశ్వసించుచున్నాము.

హేవిలంబి సంవత్సరాది

విధేయులు,
ప్రకాశకులు

# అనువాదకుని వాక్యములు

మానవజీవితములో రుచికరములైన విషయము లనేకము లున్నవి. సర్వప్రాణికోటికిని పరమగమ్యమైన పరమసత్యమును దెలిసికొనుటకై మానవుఁడు చేయుసత్యాన్వేషణ మను మహా కార్య మత్యంతరుచికర మైనది. సత్యమే సుందర మైనది, సర్వ శివంకర మైనది, శాశ్వత మైనది. అట్టిసత్యసందర్శనైకబద్ధ మైన జీవితకార్యక్రమము, సత్యమువలెనే నిత్యసౌందర్య మాధుర్యధుర్య మైనది.

సత్య మనఁగా నిర్గుణబ్రహ్మస్వరూపము. సత్యసాక్షా త్కార మనఁగా నీశ్వరసాక్షాత్కారము. మన జీవితమునకే కాక, సర్వప్రపంచమునకు హేతుభూత మగు మూలకారణ స్వరూపము, సత్యస్వరూపము నైన పరమేశ్వరు నెఱుఁగ యత్నింపని మానవజన్మము క్షుద్రమైనది. మానవకోటి చేయు సర్వవ్యాపారములకు నేకైక లక్ష్యము దుఃఖనిర్మూలనము; సుఖప్రాప్తియు నైయున్నవి. సుఖ మనుశబ్దమునకు సంపూర్ణ మగు నిర్వచన మవసరమై యున్నది. ఏది దుఃఖసమ్మిశ్రితము కాదో, ఏది నిరవధికము, నిత్యము నైనయానందము నిచ్చునో యదే నిజ మగు సుఖ మని చెప్పవచ్చును. ఈనిర్వచనము నను సరించి చూచినచోఁ బెక్కువిషయములు సుస్పష్టము లగు చున్నవి. మన మనుభవించు దేహేంద్రియసంజాత మగుసుఖము

తాత్కాలికము, దుఃఖదూషితము నైనదగుటచే పరిత్యజింపఁ దగినది. అట్లే బాహ్యవస్తువాహనాదికసంబంధ మగు నానందము. అట్లే పరాధీన మైనది లేక పరతంత్రమైనదియు సుఖ మన రాదు. ఈవిధముగాఁ బరిశీలించుచుఁ బోవునెడ, సుఖ మనునది కేవలాత్మజ్ఞానసిద్ధిచే లభించునదే కాని యింకేవిధముగను లభింపదని తెలియఁగలదు.

మనకు జీవితములో నొసఁగఁబడిన బాహ్యాభ్యంతరశక్తు లన్నియుఁ గేంద్రీకరించి సత్యాన్వేషణార్థ ముపయోగించుచో గొన్ని వేలజన్మములలో సత్యసందర్శనము ప్రాప్తింపవచ్చును. "మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే, యతతామపి సిద్ధానాం, కశ్చిన్మాం వేత్తి తత్త్వతః" "సిద్ధి పొందునిమిత్తము వేలకొలఁది జనులలో నొక్కఁడుమాత్రమే యత్నించును. అట్లు యత్నించిన వేలకొలఁదిజనులలో నొక్కఁడు నన్నుఁ దెలిసికొనును"ని శ్రీగీతావాక్యమై యున్నది. ప్రతి జీవియు నీలోకములోనికి వచ్చునప్పు డనఁగా జన్మించునప్పుడు గతజన్మసంచిత మైనసత్కృషిఫలితములను మూటగట్టుకొని తెచ్చుకొనుచున్నది. అదియే మానవులలోని భిన్నతకును వైవిధ్యము నకును గారణమైనది.

శ్రీ రాధాకృష్ణ పండితునివంటి సునిశిత మేధావి అనేక జన్మాంతరములలో చేసినసత్కృషి ఫలితముగా వేదాంతవిద్యారణ్యమున జ్ఞానకేసరియై సంచరించు సామర్థ్యమును గర్భమున ధరించి జన్మించె ననుటలో ననహజ మేమియును లేదు. అందులకే ఆయన చెప్పినాఁడు; "నాజీవితములోని నిశ్చయము లోక

పథకము ననుసరించి జరిగినవి;... అట్టి నిర్ణయము జరిగి నప్పుడు, నావ్యక్తిగతములు కాని యుద్దేశములకొఱకు నన్నొక అదృశ్యమైన దివ్యహస్తము నడపుచున్న దని గ్రహించితిని". ఇది మిక్కిలియథార్థ మైనవిషయము. రాధాకృష్ణపండితుఁడు రచించిన గ్రంథరాజములవలనను, దేశదేశముల నాతఁడు చేసినప్రసంగములవలనను, నడపిన ప్రఖ్యాతసంస్థలవలనను, అధిష్ఠించి, నిస్తులసామర్థ్యముతో నిర్వహించిన మహోన్నత పదవులవలనను, భారతీయవిజ్ఞాన విఖ్యాతి, ఖండఖండాంతరము లలో వెలసి, ఆధ్యాత్మికతత్త్వరంగమున భారతీయబ్రహ్మర్షి వాణికి జగద్గురుత్వము సంపాదించినది. శ్రీ రాధాకృష్ణపండితు నకు సాటి లేనిమేటినాగరిక లోకాచార్యపీఠము లభించినది.

క్రైస్తవ కళాశాలలో నాతఁడు చదువుకొనుటయు, స్వమతదురభిమానపూరితు లగుకొందరు క్రైస్తవప్రచారకులు హిందూధర్మతత్త్వములనే తూలనాడుచుండుటయు గమనించిన తాటస్థ్యము రాధాకృష్ణపండితుని దృక్పథములోఁ బ్రచండ పరివర్తనమునకుఁ గారణమై, ప్రాచ్య పాశ్చాత్య మతతత్త్వ ధర్మ సర్వవిజ్ఞాన సమగ్రపరిశీలనమున కాతనిచిత్తము నాయత్త మొనర్చినది. కువిమర్శకులకు సమాధానము లిచ్చుటకుఁ గూలంకషపాండిత్య మవసరము లేదు. కాని, రాధాకృష్ణ పండితుఁడు క్రైస్తవమతప్రచారకుల దుర్విమర్శనముల ఖండ నము మాత్రమే తనలక్ష్యముగాఁ బెట్టుకొనిన లఘుదృష్టి గలవాఁడు కాఁడు. తా నొక సత్యాన్వేషణైకబద్ధమైన ఉత్తమతత్త్వజిజ్ఞాస గలిగి, ఒక్కకలముగీటుతో, స్వ, పర,

ప్రాక్పశ్చిమాది బాహ్యభేదములను దుడిచిపెట్టి, మానవజాతి మానస మెట్లెట్లు చరిత్రారంభకాలమునుండియు సత్యము నెఱుఁగ యత్నించి, యెట్టి భావములను ప్రకటించినదో, తెలియఁగోరుట మహోన్నతబుజువర్తనాన్వితమైన నిష్కృష్ట నైతిక నిష్ఠ గలిగి, యాతఁడు తత్త్వప్రపంచ మానసకాసారమున నరాయంచవలె నీదులాడినాఁడు. సకలతత్త్వముల నాతఁడు పరిశీలించునెడ "అకలుషదృష్టి-ఎదుటి భావము," తప్పఁదక్కిన వన్నియు మఱచి, యేతత్త్వమున కెట్టి స్థానము నీయవలెనో, అట్లే చేసి, స్వీయతత్త్వమునకేగాక. సర్వతత్త్వములకు నిజమగు సేవయొనర్చినాఁడు. అభినవనాగరిక సభ్యప్రపంచము నెదుట నాతఁడు కేవల హిందూతత్త్వవేత్తయై మాత్రమే నిలువలేదు. విశ్వపరమార్థజ్ఞాన కోశాగార సంరక్షకుఁడై, సర్వాస్తికలోక మనఃకళంకములఁ బాపి, స్వచ్ఛదైవవిశ్వాసమును, యుక్తప్రయోజనైకాభిలాషను సుప్రతిష్ఠత మొనర్చినాఁడు. ఆతఁడు ఒక గొప్పవిజ్ఞానవేత్త సర్థము చేసికొనవలెనన్నచో, నాతనిస్థానమున మనము నిలిచియున్నట్లు భావించుసమాదరబుద్ధి గలిగి, ఆతనికిఁ గల విషయపరిజ్ఞానమును, విశ్వాసములను. ఆవేశము లను మనవిగాఁ జేసికొనవలెను," అని చెప్పినాఁడు, ఇట్టి సమాదరబుద్ధితో నాతఁడు ప్రతితత్త్వవేత్త భావములను బరిశీలించినాఁడు. 'భారతీయతత్త్వశాస్త్ర' రచనానంతరము "నేఁడు భారతీయతత్త్వశాస్త్ర మొకప్రధానముగా నభ్యసింపవలసిన విద్యాశాఖగా గుర్తింపబడినది. ఎన్సైక్లోపీడియా బ్రిటానికా సంపాదకులుగూడ (పదునాలుగువ ముద్రణము) దానికిఁ గొంత

భాగమును బ్రత్యేకించి, భారతీయ తత్త్వశాస్త్రమునుగూర్చి సన్నాహకవ్యాసము వ్రాయుమని కోరిరని రాధాకృష్ణుఁడు రచించెను.

పాశ్చాత్త్యసభ్యనాగరికతలోని కేంద్రలోపముల నుద్ఘాటించుటలో శ్రీ రాధాకృష్ణపండితుఁడు సకలపశ్చిమఖండవిద్వద్వరేణ్యులహృదయములను నిశితముగా శోధించి నిస్సంశయముగాఁ బలికినాడు; "వ్యక్తిగతానుభవమునకుఁ జెందిన ఆంతరంగికప్రపంచమును దుడిచివేయుటయే పురోభివృద్ధిలక్షణము గాదు. నైతికాధ్యాత్మికలక్ష్యముల పరిభావము క్షీణించిన ప్రత్యక్షఫలితమే నేటి నాగరికత నెదుర్కొనుచున్న భయంకరోపద్రవము."

రాధాకృష్ణపండితుఁడు చాలమందిదృష్టిలో నొకజగద్విఖ్యాత విద్వాంసుఁడే కాని, అనుష్ఠానవేదాంతి కాఁడనుభావము సరియైనది కాదు. బాహ్యాడంబరములతో నిమిత్తములేని పరమ నిష్ఠాగరిష్ఠుఁడే రాధాకృష్ణపండితుఁడు. కొందరదృష్టిలో మతానుష్ఠాన మనఁగా బాహ్యాచరణము. రాధాకృష్ణపండితుఁ డాంతరంగికముగా నీశ్వరపదాబ్జసమర్పితమనస్కుఁడు, బాహ్యముగా లౌకికోద్యోగపరతంత్రుఁడు. తత్త్వ మనగా గ్రంథ పారాయణము గాని, సిద్ధాంతప్రవచనము గాని కాదు." పూర్ణమానవ నిర్మాణము లేక సృష్టియే తత్త్వశాస్త్రలక్ష్య మని యాతఁడు రచించెను. మఱియు నాతఁడు వ్రాసినాఁడు; "తత్త్వము నుచితరీతి నభ్యసించినచో, నది మన కపజయము

లలో, దుఃఖవిపత్పరంపరలలో, దైన్యవిషాదములలో వజ్రక
వచమై రక్షింపఁగలదు.”

పరమేశ్వరపదాబ్జాంకితమైన జీవితమీశ్వరావేశితమై, యీశ్వరకార్యసాధన నిమిత్తమే వినియోగమై ధన్యమగును. శ్రీరాధాకృష్ణపండితుఁ డట్టి యీశ్వరాంకిత మైన జీవితము గల మహాత్ముఁడు. ఈమహాత్ముఁడు ప్రవృత్తిరంగమును విడువక యున్న కారణమున, లోకు లాకప్పుడు లౌకికుఁడే యని భ్రమింపవచ్చును. కాని, భగవత్పరతంత్రుఁడై లోకకల్యాణ కాంక్షతో సర్వలౌకికవ్యాపారములను నిర్వహించుటయే నిజమగు కర్మయోగిలక్ష్యము. దీనినే శ్రీకృష్ణభగవానుఁడిట్లు నుడివినాఁడు :

“తస్మాదసక్తస్సతతం కార్యంకర్మ సమాచర
అసక్తోహ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః”

(భగవద్గీత)

భారతభూమి నేఁడు కర్మయోగులసేవ నపేక్షించి యున్నది. చలింపని ధార్మికనిష్ఠతోఁ దాము తరించి, యితరులకుఁ దరణోపాయమును జూపుకర్మవీరులు కావలసియున్నారు. నిష్కళంకమైన పారమార్థిక దృష్టితోఁ, బ్రాపంచికవ్యవస్థల నన్నిఁటిని పవిత్రమొనర్చి, నడపుటయే నేఁటి ప్రపంచమున కవసరమై యున్నది. మహాత్మాగాంధి, రవీంద్రనాథ కవిపుంగవుఁడు, తిలక్ మహాశయుఁడు, జవహరలాల్ నెహ్రూ పండితుఁడు మున్నగువారు లోకశుభంకరు లగుకర్మయోగులు. రాధాకృష్ణుఁడు వేదాంతవిజ్ఞానసారముచే పావనమైన పరిశుద్ధ

చిత్తముతో నీశ్వరకార్యపరతంత్రుఁడగు ప్రశాంతకర్మయోగి. అందులకే యాతఁడేవిషయమునుగూర్చి ప్రసంగించినను, దానికేంద్రసత్యమును, గాలపుములికితోఁ జేఁపను బైకిలాగు లావణ్యముతో మధురగంభీరములగు సూటిమాటలతో వెలిబుచ్చు చాకచక్య మాతనికి లభించినది. ఆతని వనుభవశూన్యములైన పండితుని చమత్కారవాక్యములు కావు; ఆతఁడు ప్రకటించుభావములన్నియు స్వీయానుభవాగ్నిజ్వాలాతప్తములై క్రొందళుకు లీనుచుబహిర్గములైన మేలిమి బంగారు తీగలే. "మానవుఁడు తన జీవితమునే నిత్యార్పణముగా జీవింపవలెను. అపరిశుద్ధము, అపవిత్రము, కుటిలము; భగ్నము నైనదేదియు నీశ్వరున కర్పింపరాదు. పశ్చాత్తప్తమైన పవిత్ర హృదయసమర్పణమే నిజమగునారాధన మని" యాతఁ డుద్ఘాటించెను.

ఉన్నతసంస్కారమును రాధాకృష్ణుఁడు చక్కఁగా నిర్వచించినాఁడు. "దుర్బలుని, దీనుని పక్షమున నిలుచు సహజప్రకృతి ఉన్నతసంస్కారముగలవాని ముఖ్యలక్షణము," మనకంటె నున్నతస్థితిలో నున్న, మహాత్ములను జూచి గర్వరాహిత్యమును, వినయమును, మనకంటె నికృష్టదశలోనుండి నిత్యవిషాదపూరితములైన జీవితములు గల దీనజనకోటిని జూచి దహించుకొనిపోవు హృదయకోమలత్వమును, కృపారసమును, పొందుటే మనకర్తవ్యము. ఆర్తనాదము వినుటతోడనే-అది ఎవనిదైనను-ఎచటనుండి వచ్చినను - గుండె చివుక్కు మని పరితపించునాతఁడే పరమపూజ్యచరితుఁడు." చిత్తశాంతి గలిగి, సర్వప్రాణులయెడ సహజభావము చూపు మానవత్వమే,

మానవజీవితమున జీవనార్హమైన దనియు, దానివిలువ ఆరోగ్యభాగ్యమునకంటె నధికమైన దనియుఁ దెలియనగు"నని రాధాకృష్ణవాక్యము. మఱియు నాతఁడు, "అంధకార బంధురములైన జీవితమందిరములలో దీపారాధనచేయు మహనీయులు పృథ్వీమండలసారభూతుల"ని పరోపకారపారీణతను గొనియాడి, "పరిశుద్ధప్రేమ యున్నచోట మానవుఁ డిచ్చునే కాని అడ్గుఁడు. అది ప్రతిఫలాపేక్ష లేని ద"ని ప్రేమలక్షణ నిర్వచన మొనర్చినాఁడు. సర్వసమానత్వభావమును మాటలలోఁ బలుకుటయే కాక, క్రియాసిద్ధిలోఁ జూపవలె నన్నచో నిష్కలంకమై, జాజ్వల్యమానమై, సర్వప్రాణికోటి నాలింగన మొనర్చుకొనఁగలప్రేమయే ప్రయోగసాధనము. బ్రహ్మాస్త్రములు, అణ్వాస్త్రములు ప్రయోగించినచో నసంఖ్యాకమైన ప్రాణికోటి భస్మముకాఁగలదు. పరిశుద్ధప్రేమాస్త్రప్రయోగముచే, సర్వప్రాణి శాంత్యానందములఁ జేకూర్చి జగత్కల్యాణము సాధింపవచ్చును. పరిశుద్ధప్రేమామృతరస మొలికించినచోట, శత్రుత్వము మిత్రత్వమై, ద్వేష మనురాగమై, బీడువారి బీటలు దీసిన కర్కశశిలా హృదయములు, కలకలలాడు నుద్యానవనములై, భూతప్రేతపిశాచాదికమునకు నృత్యనిలయమైన శ్మశానవాటిక, గంధర్వకామినీగాన నృత్యకేళీ శృంగారారామమై ప్రకాశించును.

శ్రీరాధాకృష్ణపండితుని దివ్యవాగమృత ధారాపరంపరలలో నుండి యొక్కొక్కబిందువు నెత్తి రుచిచూప నారంభించుచో, నాయీతొలివాక్యములు వేఱొకగ్రంథమగును.

ఆపుణ్యమూర్తి పలికిన ప్రతివాక్య మొకమహోపదేశమే; సర్వోపనిషత్సారమును, సర్వతత్త్వరహస్యామృతమునుజిహ్వాగ్రమున నిలుపుకొనిన యామహనీయుని జీవితము విశ్వపావనమైనది; ఆపూజ్యచరితునివాణి విశ్వకల్యాణ ప్రదమైనది. వాని జీవితము గణనాతీతమహావిశేష సమన్వితము. ఈచిన్నిగ్రంథములో నాతఁడు స్వీయచరిత్రమును చెప్పకొన నిచ్చగింపని ధోరణి ప్రత్యక్షము. కొన్ని వేలపుటలలోఁ జెప్పవలసిన వారి మహనీయజీవితము నీకొలఁదిపుటలలో ముగించుటయే వారి యాత్మప్రకటనవైముఖ్యమును జూపును. కాని అచిరకాలములో మన కామహాత్ముని సమగ్రజీవితచరిత్ర లభించు నని యాశించెదము. ఇం దిటీవల శ్రీరాధాకృష్ణపండితుఁడు జపానురాజధానియైన టోకియోలో నొసఁగిన మహోపన్యాసరాజముఁ జేర్పఁబడినది. ఆంధ్రసోదరులెల్ల శ్రీరాధాకృష్ణచరితామృతము నాస్వాదించి చరితార్థులగుదురుగాక !

ఇట్లు
అనువాదకుఁడు

# నా సత్యాన్వేషణము

## ౧ బాల్యదశ

దక్షిణభారతమున చెన్నపట్టణమున వాయువ్యదిశలో నలుబదిమైళ్ల దూరమునందుఁ గల తిరుత్తని యనుపల్లెలో సెప్టెంబరు ఐదవ తేదీని 1888వ సంవత్సరమున నేను జన్మించితిని. నా తల్లిదండ్రులకు నేను రెండవబిడ్డను. నాతల్లిదండ్రులు పూర్వాచారపరాయణులు. జన్మముయొక్కగాని, సంపదయొక్కగాని అవకాశప్రయోజనములు నాకు లేవు. పుణ్యక్షేత్రములని ప్రసిద్ధిపొందిన తిరుత్తని యందును, తిరుపతియందును నాబాల్యము పండ్రెండు సంవత్సరములు గడచినవి. నాకు జ్ఞానము వచ్చిననాఁటినుండియు, అనిత్యమైన బాహ్యప్రపంచదృశ్యముల వెనుక మన కగోచరమైన యింకొక ప్రపంచముయొక్క అస్తిత్వసత్యత్వములందు నాకు దృఢవిశ్వాస ముండెడిది. దానికిఁగారణము నాకుఁ దెలియదు. అట్టి యథార్థజగత్తును మనము మన యింద్రియములచేఁగాక మనస్సుతోడనే గ్రహింపఁగలము. నాకు దారుణకష్టములు సంభవించినప్పుడైనను ఈవిశ్వాసము చలింపలేదు. నా కేకాంతవాసమన్న నభిలాష యుండెడిది; కారణము ధ్యానపరమైన నా చిత్తసంస్కారమే కావచ్చును. నా బాహ్యప్రవృత్తితోపాటు,

నాలో, నాకిష్టమగు నేకాంతవాసము నిచ్చునాంతరంగిక జీవితము కూడఁ బెంపొందుచు వచ్చెను. గ్రంథములు, అవి ఆవిష్కరించుదృశ్యములు, అవి కలిగించు స్వప్నములు, మొదటి నుండియు, నిత్యములై నా కెడ తెగని మిత్రములై యుండెడివి. నాకు బాగుగా చనవైనవా రొకరో యిద్దరో కానియెడల నితరులతోఁ గాలము గడపవలసివచ్చుటకు నేను గొంతప్రయత్నము చేయవలసివచ్చెడిది. కాని అవసరము వచ్చినయెడల నేవ్యక్తితోనైనను, అల్పుఁడుగానీ, అధికుఁడుగానీ, యువకుఁడుగానీ, వృద్ధుఁడుగానీ,వానితోఁ గలిసిపోయి తన్మయత్వమందు విచిత్రమైన నేర్పు నాకుఁ గలదు. నేను ప్రధానముగా మోమోటము, గలిగి ఏకాంతముఁగా నుండగోరువాఁడనైనను, నలుగురతోఁ, గలిసిమెలసి యుండు మిత్రప్రియుఁడనని నన్నుఁ దలఁతురు. నా నివృత్తిలక్షణము, నాసమాజజీవనాభిలాషయుఁజూచి మిత్రులు నాతత్త్వము దురవగాహమైన దను విఖ్యాతిని గలుగఁజేసిరి. మఱియు నేను నిరుత్సాహి ననియు, పెంకిపట్టునలగలవాఁడననియు దలఁచుట నాకాశ్చర్యమును గలుగఁజేసెను. ఏలన, వానికి వ్యతిరేకలక్షణములే నావని నే నెఱుఁగుదును. సుదృఢ, ప్రచండోద్రేక భావములు నాకుఁ గలవు కాని నేను వానిని బైకిఁ జూపను. నేను దుర్బలములైన నరములుగలిగి, మిక్కిలి దురభిమానముతోఁగూడిన ఆవేశపూరితుఁడను. ఈవిధముగా, చంచలము, దురభిమానపూరితమునైన స్వభావముతో పాటు సామాన్యబుద్ధిశక్తిని గలిగిన నాజీవిత మింకను నిరర్థకమై చెడకుండుటకుఁ గారణము, నాయదృష్టమనియే చెప్పవలెను. గ్రంథ

ప్రముఖకర్త నాయీఆత్మకథావ్యాసమును గోరినచోఁ గోర వచ్చును. ఉన్నతపదవి నీయవలయు నుద్యోగస్థులపట్టికలోని నామములపైఁ దన నిశితదృష్టిని సారించి నెపోలియన్ ఒకనామమున కెదురుగా "ఈతఁ డదృష్టవంతుఁడా ?" యని వ్రాయుచుండెడు వాఁడట ! నా కదృష్ట మున్నది. ఇంతవఱకు నాయదృష్టమే నన్నుఁ గాపాడినది. లెక్కకుమీరిన జాతిగుట్టల మధ్యమునఁ బోవుచున్నది. నాజీవితనౌకను నడపుచున్న యొక కర్ణధారి గలఁడని నానమ్మకము. ఈజాతిగుట్టల డీకొని పెక్కుజీవితనౌకలు భగ్నములైపోయినను, నాది మాత్రము ప్రమాదము లేకుండ నడచుచున్నది. నాజీవితములోని నిర్ణయములన్నియు నొకప్రణాళిక ననుసరించి జరిగినవనియు, నట్టి సందర్భములో నొకనిశ్చయము చేసినపుడు, నావ్యక్తిగతములైన ఆశయములతో సంబాధములేకుండ నేదో కొన్నిలక్ష్యముల సిద్ధినిమిత్తమై, అగోచరమైన ఒకహస్తము నన్ను నడపుచున్నదనియుఁ దోఁచినది.అనఁగా దేవునికి నాపైని ప్రత్యేకాభిమానమున్నదని నటించువాఁడనుగాను. పరమేశ్వరునకు, మానవులనుగూర్చి, వ్యక్తిగతమైన అభిమానమును, లలితమైన శ్రద్ధయుఁ గలవనియు, భగవానుని ప్రేమ వ్యక్తిగతము,అనవద్యము, హృదయపూర్వకము ననియుఁ జెప్పవచ్చును. దీనిని మించిన ప్రత్యేకాభిమానము నాతఁడు మనకుఁ జూపెననుట హేతువిరుద్ధభావము. జీవితములో నేను బొందినస్వల్పవిజయమునకుఁ గారణము, నా యదృష్టమో లేక, యీశ్వరుఁడు వెనుకనుండి నన్ను నడపించుటయో యని చెప్పుదును, గాని, నాకుఁ గలిగిన అపజయము

లకు దురదృష్టమునుగాని, పరిస్థితులనుగాని కారణములుగాఁ జెప్పి నిందించువాఁడనుగాను. నేను గాంచిన జయపరంపరకు నేనే పూర్తిగాఁ గర్తనుగాను. కాని నేనొర్చిన దోషములు మాత్రము, చాలవఱకు, నాదౌర్బల్యమూర్ఖత్వముల కారణమునవే సంభవించెనందును.

## ౨ గృహజీవనము

తాను ప్రేమించిన భార్యయుఁ, దనయభిరుచి కనుకూలమైన వృత్తియు లభించిన మానవుఁడు ధన్యజీవి యని హెగెల్ చెప్పిన వాక్యములు నేను వయసువచ్చిన వెనుక జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచుండువాఁడను. రాజకీయముతోడను, వ్యాపారముతోడను, కాంతాకాంక్షతోడను, పదవీవ్యామోహముతోడను, జీవితమను ఆసవపాత్రను మగవారు పూర్తిగా త్రాగివేయుచుండఁగా, అమాయకురాండ్రు, వాస్తవికతకు సమీపవర్తినులునైనస్త్రీలు, పునరుక్తమైన నిత్యదైనికచర్యలే జీవితము కాఁజాలదని గుర్తింతురు. వా రెక్కువనిగూఢము, పారమార్థికమునైన సత్యము నారాధింతురు; ఈదృష్టితోఁ జూచుటచే వారికి జీవితమనఁగాఁ దాత్కాలికము క్షుద్రము నైనదిగాదు. అర్థవాదులకును, పరమార్థవాదులకును మధ్యమందు జరుగుచున్న పోరాటములో, అనఁగా, మనము మన యింద్రియములతో స్పృశించి, అనుభవించుటకు వీలైనవస్తువులే సత్యములని నమ్మువారికిని, అంతేకాక, పారమార్థిక సత్యప్రయోజనములను గూడ నమ్మువారికిని జరుగువివాదములో, భారతీయనారీమణు

లెల్లప్పుడు పరమార్థమును నమ్మువారిపక్షముననే నిలిచి యుండుట సుప్రసిద్ధవిషయమై యున్నది. మన నిత్యజీవితములో ముఖ్యభాగము నాక్రమించు సామాన్యవిషయములకు, భారతీయవనితలు తమప్రవచనముచేఁగాక, ఆచరణము చేతను మాటలచేఁగాక జీవితముచేతను, గంభీరార్థములను గల్పించు చున్నారు. నాతరము వారిలో, నాకులమునకుఁ జెందినవారు పెక్కుమంది, పశ్చిమదేశములలో వలెఁగాక, మిక్కిలి పిన్న వయసులోనే వివాహమాడిన మాట నిజమేకాని, యీబాల్య వివాహము లపసవ్యఫలితముల నిచ్చియుండలేదు. హిందూ ధర్మము ననుసరించి, భార్యయొక్కలక్ష్యము, మహోన్నతము, కఠిననియమాన్వితమునైనది. ఈలక్ష్యమింకను పెక్కుమంది అమాయకురాండ్రైన హిందూసతీమణు లనుసరించుచున్నారు. "ఆతఁడు ధర్మపత్నీవ్రతుఁడు గాకున్నచో నేను ధర్మపత్నినే యగుదును;ఆతఁ డతిచారియైనను నేను నిర్వికారచిత్తనగుదును. ఆతఁ డన్యకాంతారతుఁడైనచో,నేనాతనిరాకకై వేచియుందును" ఇట్టి 'అంధప్రాయమైన పతిభక్తిలో దోషమున్నచో, నీవిధమైన ప్రేమతోడనే మనలను ప్రేమించు భగవానునియందుఁ గూడ దోషమున్న దనవలెను. మనము క్షణికములైన యిహలోక సౌఖ్యములచే నలసి, తిరిగి వచ్చునందాఁక, భగవానుఁ డేయులసటగాని లేకుండ,నోర్పుతో మనకై వేచియుండి మనలను ప్రేమించును. మన మెవ్వరిని ప్రేమింతుమో ఆవ్యక్తియందలి లోపములను జయింపఁగల, చలనములేని పరిశుద్ధప్రేమయే దైవదత్తమైన గుణములలో గుణరాజమని చెప్పవచ్చును.

అత్యంతలలితము, గాఢానురాగపూరితమునైన భారతీయ దాంపత్యజీవితము, సాంఘిక నియమములలో సముచితములైన మార్పులుచేసిన యెడల నింకను విశేషప్రయోజనసిద్ధి నందఁ గలదు. సంఘాచారములతో శాసనసభ లెట్టిజోక్యమును బెట్ట కొనని కారణముచే నీసాంఘికవ్యవస్థలు జడస్థితి నందినవి. తమ దేహమనోభగ్నతనుండి తప్పించుకొనుటకు భారతీయనారీమణు లకు వారి భర్తల అనుగ్రహమే రక్షణమై యున్నది. కాని ప్రస్తుతపరిస్థితులలో నిది చాలదు.

## 3 తత్త్వము : మతము

నా ప్రాథమికవిద్యయుఁ గళాశాల జీవితమును గూడ క్రైస్తవవిద్యా సంస్థలలోనే జరిగినది. క్రొత్తవిషయములు బాగుగా పట్టుకొనుదశలో, బైబిలులోని ఉపదేశములతోఁ బరిచయము నాకు లభించుటేగాక, క్రైస్తవప్రచారకులు హైందవాచార విశ్వాసములపై విసరిన విమర్శలన్నిటితో నాకు సంపర్కము సంభవించెను. వివేకానందస్వాములవారి ఖండాం తర సాహసయాత్రయు, వారి వక్తృత్వమును గలుగఁజేసిన 'నేను హిందువు'నను గర్వము, క్రైస్తవ విద్యాసంస్థలలో హిందూ మతమునుగూర్చి చేయుచున్న దూషణములవలన, విఘాత మందినది. మనము తెలిసి ప్రతిదినాచరణములోఁబెట్టుచున్న సర్వభారతీయ సంస్కృతితోడను నేటి మన ప్రపంచమునకు సజీవసంబంధమును నిలిపి రక్షించుచున్న హిందూసన్న్యాసులు, గురువులు, నిజముగా మతజ్ఞానశూన్యులని చెప్పుట నాకెంతయు

దుస్సహముగా నుండెడిది. ప్రాచీనగృహస్థ సంప్రదాయములు మతాచారములు గలిగిన నిరక్షరాస్యులు. నిరుపేదలు నైన గ్రామజనులుకూడ, జగత్తు నావరించియున్న రహస్యాత్మ విజ్ఞానమునుగూర్చి, నాగరికులై సుఖలాలసులై, జీవితభోగానుభవములకై పెనఁగులాడు ధీమంతులకంటె నెక్కువ తెలిసినవారని నాకు గోచరించెను. సర్వకాలములయందు బుద్ధిమంతులైనవారికి జీవితమను నద్భుత దృశ్యమును దర్శించుటచేఁ గలిగిన సత్యాంశములు, యథార్థ విజ్ఞానసూత్రములు, వారికిఁ గరతలామలకములు. జీవిత మల్పకాల ముండును; సౌఖ్యము సంశయాస్పదమైనది; మృత్యు వందఱకును సమానము; దరిద్రుఁడనియు, ధరిత్రీనాథుఁడనియు భేదములేదు. నిజమైన జ్ఞానము నార్జించుటనఁగా మానవుఁడు దన యజ్ఞానము నెఱుఁగుటయే. సర్వసంపదలకంటె సంతుష్టియే అధికమైనది. శాంతిగల చిత్తము జనసమాజము లిచ్చు సంస్తుతులకంటె నెక్కువ విలువ గలది. మూఢవిశ్వాసములుగల భారతీయకాంతకుఁ గొన్ని భయభ్రాంతు లుండవచ్చునుగాని, అనేక శతాబ్దములనుండి లభించిన శిక్షణాఫలితముగా, నామె ప్రజ్ఞావిశేషముల నధికముగాఁ బ్రదర్శించు సమకాలిక నాగరికవనితల కెవ్వరికిలేని, సమున్నత గౌరవము, కోమల సంస్కారము, ప్రసన్న హృదయము, విశ్వవిశాలదృష్టిని జూపఁగలదు. ఒకమారుమూలపల్లెనుండి బయలుదేరి తా నార్జించిన సర్వస్వమును, గంగాస్నానముకొఱకో, జగన్నాథస్వామి దర్శనార్థమో, వ్యయించి కాశీక్షేత్రమునకో కైలాసగిరికో పోవుటకై అధికప్రయాసలతోఁ గూడిన దీర్ఘ

ప్రయాణములు చేయుటకు వెనుదీయని యాత్రికుఁడు మానవుఁ డుదరపోషణమునకు మాత్రమే జీవింపరాదను నిశ్చలాంతరంగిక విశ్వాసమును ప్రదర్శించును. అతివాదలక్షణాన్వితమైనది మన యుగము. తాను చూపు బాహ్యవేషాధిక్యమును నమ్మి, దేవుని, దేవతలను, ఉన్నతలక్ష్యములను, విలువలను నరుఁడు హేళన చేయును. ప్రాఁతపడిన యీమూఢవిశ్వాసముల నీయుగము గణింపదు కాని, చదువెఱుఁగని హిందువులు మాత్రము మన తర్కబుద్ధి కందరాని మహాశయ చిహ్నములుగా వీనిని గ్రహింతురు. అందుచే వారు మనకు గర్హింపఁదగరు. ఆత్మవినాశకరములగు నంధవిశ్వాస దాసులై నేఁటి భారతీయులు జీవించుచున్నారని నేనెఱుఁగుదును గాని, వారికిఁ బరమార్థ పరతంత్రత లేదనుట నేను నమ్మఁజాలను. నీవు దేవుని ప్రేమింపవలెను; పాపము చేయరాదు; ఆప్తులైనవారికి దయార్ద్రహృదయమును జూపి సాయపడుమని, తన సంతానమున కాత్మవికాసముగోరు తల్లి తనబిడ్డలందఱకు బోధించును. కాలమును మ్రింగివేయు గణనాతీతపద్ధతులను మనము కనుఁగొనియున్నాము. ప్రాచీనవిశ్వాసమతియగు భారతీయుని పద్ధతి ఢోమాత్రము వివేకములేనిది కాఁజాలదేమో! శాశ్వతాశయములనుగూర్చి మననముచేయుటయుఁ బ్రజ్ఞానేత్రముచే దైవసాక్షాత్కారసిద్ధి గాంచుటయుఁ బరిపూర్ణత నార్జింపఁగోరి తచ్ఛాయలఁ దిరుగాడఁ గోరుటయు నికృష్టజీవిత మనుటెట్లు పొసఁగును?

మానవునంతరాత్మ దేనిని పవిత్రమైన దానిఁగా నెంచెనో, మఱియు నెంచుచున్నదో, దానిని గూర్చి యెన్నఁడు

నొక్క నిందావాక్యమును బల్కుటకు నామతదృష్టి అంగీక రింపలేదు. సకలమతములయెడ నిట్టిగౌరవభావము, ఆత్మజ్ఞాన విషయములలో నిట్టి ప్రాథమికసత్త్వవర్తనము, బహుయుగాను భవమువలన, హిందూసంప్రదాయము, ప్రతిహిందువుయొక్క రక్తమాంసములలోఁ బ్రవహింపఁజేసినది. అనాదిగా హిందూ సంస్కృతికిఁ బ్రాణప్రదమైనది పరమతసహనము. వైదికా ర్యులు, భిన్న మతోపాసకులగు ప్రజలతో సంపర్కము కలిగి నపుడు, వెంటనే వారు నూత్నపరిస్థితులలో సామరస్యముఁ గూర్చుకొనిరి. పరుల మతభావములు, స్వీకరించి, సంస్క రించి, తన సాటిలేని స్వరూపమును నిర్మించి, తీర్చిదిద్దుకొను టలో వైదికమతమున కమూల్యభావసంపదను, నిరాఘాటమైన మహోత్సాహమును సమకూర్చినవి. అన్యదేవతలయందు భక్తి శ్రద్ధలు గలవారైనను, పరోక్షముగాఁ బరమేశ్వరుని యందు భక్తిశ్రద్ధ లున్నవారనియే సుప్రసిద్ధమతగ్రంథమైన భగవద్గీత చెప్పుచున్నది. భగవంతునిగూర్చిన జ్ఞానమే మతమునకుఁ బర్య వసానము. భగవానునిగూర్చి చెప్పుసిద్ధాంతములు, ముక్తి పొం దని ముముక్షువులకు సహకారులుగా నుండును. అవి దేవునిఁ గొన్నిరూపములలోఁ గొన్నిగుణములు గలవానినిగాఁ జెప్పునే కాని, యాతని స్వస్వరూపమును జూపఁజాలవు. క్రైస్తవ ప్రపంచములో విశ్వజనకుఁడైన యీశ్వరుఁడు విశ్వజననిగా మధ్య యుగములలో మార్పునొందెను. మేరీదేవిని. "స్వర్గలోక రాజ్ఞి; సంకల్పమాత్రమున సర్వము నామెచేయఁగలద"ని వర్ణించిన విషయమే దృష్టాంతము. ఏసిద్ధాంతమును దేవుని సంపూర్ణ

ముగాఁ జెప్పఁజాలదు. మఱియు, మనమున్న వికాసదశ ననుస రించి, మనము గ్రహింపఁగలజ్ఞానము నిర్ణయింపఁబడును. తన సామర్థ్యము ననుసరించి, అల్పభావము గలవానికి సమున్నత సత్యము నుపదేశింపరాదు. జీవితము తనలోతు నెఱిఁగిన కొలఁదియు, మన కసమగ్రముగాఁ దోఁచినభావ మధికసమగ్రత నందుచుండును. నిజమైన గురువు, మన అంతర్దృష్టిని వికసింపఁ జేయునే కాని, బాహ్యదృష్టిని మార్చుటకు యత్నింపఁడు. మన మతగ్రంథముల యుపదేశములను గూర్చి యాతఁడొక నూతన దృష్టిని మనకిచ్చును; "నామార్గమునే సర్వమానవులును బట్టు చున్నారు." వివిధమతములును, పరస్పరశ్రద్ధతోఁ బోరుసల్పు చున్న శత్రుస్వరూపశక్తులుగావు;అవి ఒకే మహాకర్తవ్యమునఁ బనిచేయుచున్న సోదరకార్మికులవంటివి. ఏజాతియందును దన్ను గూర్చి సాక్ష్యమునిచ్చువారిని లేకుండ భగవానుఁడు చేసియుండ లేదు. విహితవివేకముగల మానవులందఱిలో సర్వశక్తి సమన్వి తుఁడగు భగవంతుఁడు సహజావిష్కారము పొందుచున్నాఁడని అలెగ్జాండ్రియాక్లిమెంటు అంగీకరించెను. ఇట్టి విశ్వాసము లలోఁ బెంపొందిన నేను, నిజముగా మతాభిమానము గల జనులు—పెక్కుమంది క్రైస్తవమత ప్రచారకులు నిస్సంశయ ముగా నట్టివారు—అత్యంతభక్తితో పూజించు నితరుల సిద్ధాంత ములను దూలనాడుటను సహింపఁజాలనైతిని. ఈగర్హింపఁదగిన యాచారము, జీసస్ జీవితములోఁగాని, ఉపదేశములలోఁగాని యెచ్చటను లేదని నాయభిప్రాయమై యున్నది. అనంతరము కొందరు జీసస్ అనుచరులిట్టి యాచారమును ప్రోత్సహించిరి.

బైబిలులోఁ జెప్పఁబడినవిగాక మఱేయితర సత్యములైనను, పైశాచిక కథనములనియు, రాక్షస ధర్మములనియు ఆగస్టైన్ భావము. భిన్నమత సత్యపరిశీలనము శ్రద్ధగాఁ జేసిన విద్వాంసులు దైవప్రోక్తములగు విషయములరుజూచి సంతసించిరి. దేవునిఁగూర్చిన సర్వసత్యములును దేవునియందే బీజరూపమున నున్నవి. ఒకేప్రత్యేకజాతి కొకేదైవవాక్యావిష్కృతి గలదనుట దేవుని ప్రేమకు, ధర్మదృష్టికి విరుద్ధమైన ప్రసంగమగును. తమమతమే సంపూర్ణమత వికాససిద్ధిరూపమగు పుష్పరాజమనియు నందే యితర మతములన్నియు గర్భితములై యుండుననియుఁ జెప్పువాదము కొందఱు మతాసక్తచిత్తుల మధుర స్వప్నము రాఁబోవు నూతనప్రపంచములో మత జ్ఞాన ధన కోశము మాహస్తములందే యుండు నను పిడివాదమునకుఁ దావు లేదు.

హిందూమత మన నేమో అందేది సజీవమో, యేది నిర్జీవమో బాగుగాఁ దెలిసికొనుకోర్కెను, క్రైస్తవప్రచారకుల విమర్శారూపకమైన సవాలు నా కుదయింపఁజేసెను. నిద్రాముద్రితమైయున్న భారతదేశము కదలిక గాంచిననాఁటి వాతావరణముకూడ నానిశ్చయమును బలపఱిచెను. చెన్నపురి విశ్వవిద్యాలయములోని బి. ఏ; యమ్. ఏ; పాఠ్యప్రణాళికలలోఁ దత్త్వశాస్త్రశాఖకుఁ జెందిన విద్యార్థులు, భారతీయతత్త్వ మత విజ్ఞానమును నేర్వనవసరము లేకుండెడిది. నేఁడైనను, భారతీయ విశ్వవిద్యాలయములలో భారతీయతత్త్వశాస్త్ర మల్పస్థానమును

మాత్రమే యాక్రమించుచున్నది. యమ్.ఏ. పరీక్ష కేర్పఱిచిన నియమముల ననుసరించి, వేదాంతతత్త్వములో నీతికి స్థానము లేదను దోషారోపణమునకు సమాధానముగానుండు నిమిత్తమై "వేదాంతమున నీతిశాస్త్రము" అనునొక వ్యాససంపుటిని దయారుచేసితిని. ఆ సమయమున (1908) నా యిరువదవయేట నేనొక విద్యార్థిగానుండి, గ్రంథ ముఖపత్రముపై నాపేరనొక పుస్తక మచ్చగుట నాకెంతయు నుద్రిక్తానంద హేతువైనది. కాని నేడు దానినిగూర్చి తలంచినచో, నందలి నా యనుభవ శూన్యమైన శబ్దప్రకటనోత్సాహము, నాకు లజ్జాహేతువై, దానిని నే నేల వ్రాసితినని విచారింతును. కాని ఆశ్చర్యమేమనఁగా నాఁడు నా కాచార్యుఁడు, నేఁడు మదరాసు క్రైస్తవ కళాశాలాధ్యక్షుఁడు, సుప్రసిద్ధ విద్వాంసుఁడును, మతవిద్యారంగమున నిశితమేధావియునగు ఎ.జి.హాగ్ పండితుఁడు నాకొక ప్రమాణ పత్రిక నిచ్చియున్నాఁడు. దానిని నేఁటికి నొక యమూల్య ధనముగాఁ జూచుకొనుచున్నాను. ఆతఁడిట్లు వ్రాసెను; "ఎం.ఏ. డిగ్రీ నిమిత్త మీతఁడు తన రెండవ సంవత్సర విద్యాభ్యాసములోఁ దయారుచేసిన వ్యాససంపుటి తత్త్వశాస్త్రప్రధాన సమస్యల నెఱిఁగి, క్లిష్టమైన వివాదగ్రస్తవిషయముల నతిసులభముగా వ్యక్తముచేసిన, అసాధారణప్రజ్ఞను, ఆంగ్లభాషలో సామాన్యులమించిన అధికారపాండిత్యమును, ప్రదర్శించుచున్నది." ఐనప్పటికిని నాఁటి వ్యాససంపుటియే నా సునిశ్చితాభిప్రాయములను జాలవఱకు వ్యక్తీకరించును. వివేకవిలసితమైన జీవితక్రమముగా మతము మాఱిపోవలెను. జీవాత్మ యీ ప్రపంచములో

నొక కారాగారవాసివలెనో, లేక యొక చోరునివలెనో గాక, స్వగృహములోవలె సుఖముగా నుండఁగోరుచో, వ్యావహారిక జీవితమునకుఁ బునాదుల నింకను లోతుగా నిర్మించి సురక్షితములుగా నుంచవలెను. మతము వివేకవిలసితమైన సమాలోచనముగాను, ఫలప్రదమైన కార్యముగాను, విహితధర్మనిష్ఠితములైన సాంఘికసంస్థలుగాను వ్యక్తము కావలెను.

1909 ఏప్రిల్‌నుండి, మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తత్త్వశాఖకు సన్నాచార్యునిగా నియమించినప్పుడు నేను తత్త్వశాస్త్రబోధకుఁడుగా నుండి, భారతీయతత్త్వమతములనుగూర్చి దీక్షతోఁ జదువఁబూనితిని త్వరలో నేను మతమనఁగా స్వేచ్ఛారూపమైన వ్యక్తిగతానుభవమనియు, దాని నింకొక టేదియనియు భ్రమింపరాదనియు, నది నీతికూడఁ గాదనియుఁ, గాని మహోన్నత నీతిధర్మ సంపుటిగా నది వ్యక్తమొనర్చుకొనుననియు నిశ్చయమునకు వచ్చితిని. మతము ముఖ్యముగా నాంతరంగికజీవిత సంబంధముగలది. నిరర్థకమైనట్టియు, మాంద్య నిరాశోపహతమైనట్టియు జీవితము నున్నతపథమునకు లేవనెత్తఁగల ఆత్మజ్ఞాన నిశ్చయము నిచ్చునదే మతము కావలెను. విలువలకు రక్షణము నిచ్చి, జీవితము నర్థవంతమొనర్చి, సాహసక్రియలలో ధైర్యప్రదానముచేయు నుత్కృష్టప్రమాణము ననుసరించి మతమును బరిశీలింపవలెను. మన ఊహాబుద్ధిసంకల్పములకంటె నింకను లోలోపలనున్న ఆత్మలో మతముయొక్క మూలము లున్నవి. హృదయాకాశమున మిక్కిలిలోతైన ప్రదేశమును నిర్మలముగా

చూచుచో నందు దైవతత్త్వము ప్రతిబింబించును. శ్రీచరుపండితుఁడు "మానవహృదయములో నీశ్వరుఁ డనంతత్వము నుంచినాఁడు. అనంతమైనదానిని గూర్చిన భావమే మతమున కాధారము." అని పలికినాఁడు; మననేత్రములు చూచునట్టియు మన శ్రోత్రములు వినునట్టియు వానితో నీభావము తృప్తినొందదు. దానిని వికసింపఁజేసినచో, భౌతికప్రపంచమునకు భిన్నమైన వేఱొక సమున్నతలోకమును మనకుఁ బరిచయమొనర్చును. ఒకవ్యక్తి అధికనీతిమతి గావచ్చును; నిర్దుష్టధర్మానుష్ఠానపరుఁడు గావచ్చును. విశ్వమంతయు నీశ్వరాధీనమై నడచుచున్నదను నాశావిశ్వాసములను గలిగియుండనిచో నాతఁడు మతప్రియుఁడు గాఁడని చెప్పవచ్చును. మనలో మిక్కిలి శక్తివంతమైన బుద్ధికి సంతృప్తినిచ్చుటమాత్రమేగాక, మనప్రాణశక్తిపోషకమగు దైవసంపర్కస్పర్శనొసఁగి, మన స్వస్వరూపౌన్నత్యము నెఱింగించి, మనము తరించునట్లు చేయఁగల యేపరమసత్యజ్ఞానము లేక అంతర్దృష్టి యున్నదో అదియే మతమని నిర్వచింపవలెను. ఈలక్ష్యమును సాధించుటకు, మిక్కిలి తీక్ష్ణమైన ఆత్మసాధనము ధార్మికదీక్షయు నవసరములు. ఈశ్వరసాక్షాత్కారసిద్ధికిఁ బవిత్రహృదయము కావలెను. సత్యము నెఱుఁగుటకుఁ బాండిత్యము కాదు, చంటిబిడ్డ నిర్మలహృదయము వాంఛితము. దైవసాంగత్యమును జేకూర్చు చిత్తశుద్ధిసాధకమైన నిత్యానుష్ఠానమున కున్నతస్థానము గలదు. పరమావధిని జేరినవెనుక, ఆత్మ తేజోవంతమై, జీవితమునంతను ప్రకాశవంతమొనర్చి, ధర్మశీలశక్తి సమన్వితముగాఁ జేయును.

హిందువుల ఆచార మెట్లున్నను, హిందూమతము మాత్రము ఇహలోకసంబంధి కాదనికాని, కేవల పరలోక సంబంధిమాత్రమే యని కాని చెప్పరాదు. దాని ననుసరించి, మతలక్ష్యము జ్ఞానసిద్ధి లేక, దైవసాక్షాత్కారము; నీతిశాస్త్ర లక్ష్య మేమనఁగా, నగోచరమైన దైవజీవితములోనికి మానవ జీవితమును పునర్నిర్మాణము చేయుటే. రెండు నొకదానితో నొకటి పె వేసికొనియున్నవి. అనంతమైన ఆత్మాస్తిత్వవిశ్వాసమే, లక్ష్యమును జేరుట కుత్సాహశక్తి నిచ్చును. అది ధర్మానుష్ఠానమునుగూర్చియుఁ బావనత్వమును గూర్చియు జాజ్వల్యమానమగు నాసక్తిని వెల్లడించును. ఆత్మకాంక్షయు ధర్మనిష్ఠాపరత్వమును గలిసి యుండును.

ఆర్యుఁడైన వానిచిహ్నము, పాండిత్యమును మతమును గావు; సుశీలమే యని మహాభారతములో నొకశ్లోకము చెప్పుచున్నది. భారతదేశములోఁ దత్త్వశాస్త్రమనఁగా మానవజీవితమునకు సంబంధములేని అవాస్తవికవిద్య కాదు. అది మానవజీవితనిర్మాణములోఁ గలిసిపోవునట్లుగఁ జేయఁబడినది. తత్త్వజ్ఞానమును సాంఘికజీవితములో రూపింపఁజేయుయత్నమే భారతీయనాగరికత. విద్వత్పత్రికారాజములైన ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఎథిక్సు మానిస్టు. క్వెస్టు, మున్నగువానిలో నప్పుడప్పుడు నేను ప్రకటించిన వ్యాసములకు, హిందూమతము నీతి విరహితముగాదని చూపుటే లక్ష్యమైయున్నది. లౌకికసాధనములైన కుటుంబప్రేమ, దయ, మైత్రి, విధేయత, సద్విషయముల యెడఁ బూజ్యభావము మున్నగువానివలన నాధ్యాత్మికపరియో

జన మిహలోకములో సాధింపఁబడును. నిజమగు మతప్రియు నికి జీవితమంతయు నొకపవిత్రవిషయమే. జాతియొక్క సామా న్యస్థితిని బాగుచేయుటకును, పతితులు, దీనులు నగు ప్రజలకు ధైర్యోత్సాహముల నిచ్చురీతిగా సంఘమును దీర్చిదిద్దుటకును నేఁడు చేయుచున్నప్రయత్నములు హిందూమతమునకు విరుద్ధ ములుగావు సరికదా, అట్లుచేయుటే హిందూమతప్రబోధమై యున్నది.

హిందూమతముతోఁ గలిపి చెప్పఁబడు జగత్తుమిథ్యయను వాదమునందలి విశ్వాసము, నైతికనిష్ఠకు విరుద్ధమని విమర్శింపఁ బడెను. నీతినియమాచరణమునకు వ్యతిరేకముగా మాయా సిద్ధాంతమున కీవిధముగా నర్థముచెప్పుట యుక్తము కాదు. ప్రపంచము పరమార్థముపై నాధారపడి,దానినుండియే వచ్చిన దని మాయావాదము చెప్పును.జగ మెల్లప్పుడు మార్పునొందు చుండఁగా,సత్యస్వరూపము మార్పులేని దని భావము. అందుచే జగత్తునకుఁ బరమాత్మకంటెఁ దక్కువస్థితియున్నది. ఎంతమాత్ర మును జగదస్తిత్వము మిథ్యయనికాని, లేనిదనికాని భ్రమింప రాదు. మాయావాదపోషకుఁడగు శంకరుఁడు గూడఁ బరబ్రహ్మా స్తిత్వమును, పరివర్తనశీలము గల ప్రపంచమును, స్వప్నభ్రాం తుల మిథ్యారూపమును స్పష్టముగా వివరించెను, మఱియుఁ బెక్కుమంది వేదాంతవాదులు, మాయావాదమును బూర్తిగా నిరసింతురు.

హిందూనీతిధర్మము, మాయాసిద్ధాంతములఁ గూర్చిన భావములకు రవీంద్రనాథటాగూరు రచనలలో నాకు విశేష

బలము లభించినది. ఆయన రచనలను (ఆంగ్లానువాదములు) జదివిన ఫలితముగా నొకగ్రంథము వ్రాసితిని. 1918లో లండన్ మాక్మిలన్ కంపెనీవారు దానిని ప్రకటించిరి. అనుభవములేని యౌవనములో రచించుటచేఁ బెక్కుదోషములున్నను, అది మొత్తముమీదఁ గొనియాడఁబడెను. రవీంద్రుఁడుసైతము విశేషాభిమానము చూపెను; 1918 డిసెంబరులో నాతఁ డిట్లువ్రాసెను; "నాకు సంబంధించిన యీగ్రంథమునుగూర్చి నేనే చేయువిమర్శ నిజముగా నంగీకారయోగ్యము కాకపోవచ్చునుగాని, నే నూహించిన దానికంటె నధికసంతృప్తి నది నాకొసఁగినది. మీరు చూపిన కార్యదీక్షయు, మీరుప్రదర్శించిన ప్రజ్ఞాగాంభీర్యమును నన్నాశ్చర్య చకితునొనర్చినవి. మీరువాడిన భాషలోని నుడికారపు సొంపునకు నాకృతజ్ఞతాభివందనములు. పాండిత్యప్రకర్షముకాని, కేవలసాంకేతిక పదగుంఫనముకాని లేని సరళభాషా సౌందర్యమును మీరు చూపితిరి."

1918 లో నన్ను క్రొత్తమైసూరు విశ్వవిద్యాలయమున తత్త్వశాస్త్రాచార్యునిఁగా నియోగించిరి. నేనిదివఱకు సల్పిన విద్యాపరిశ్రమకు ఫలితముగా మతమనఁగాఁ బిడివాదములకు సంబంధములేని యాత్మజ్ఞానముగా నిశ్చయించితిని. అది వ్యక్తిగతమైన రహస్యదర్శనముగాని, బాహ్యాశాసనపూర్వకముగా నియమించునదికాని కాదు; అది హేతుజ్ఞానమునుండియు, ఆంతరంగికానుభవదృష్టి నుండియు సహజముగా నుద్భవించును. తత్త్వశాస్త్రము మతమునుగూర్చిన ఆత్మజ్ఞానదృష్టిలేక సమగ్రజ్ఞానదృష్టినిచ్చునని నాయభిప్రాయము. దేవుఁ డమర్త్యుల కథ్య

ష్కుఁడనియు ,మానవులు శాశ్వతాత్మస్వరూపులనియు, వారు సర్వకాలములయందు వారితోలఁగింపరాని ప్రత్యేకవ్యక్తిత్వముల నిలఁద్రొక్కుకొందురనియుఁ జెప్పు జీవానేకత్వ సిద్ధాంతమును సమర్థించుటకుఁ దత్త్వశాస్త్రమును వినియోగించినయెడల దాని యర్థము మనము మనకుఁ బ్రియములైన స్వీయమతాభిమాన ముతోఁ దత్త్వశాస్త్రమునకు రూపకల్పనము చేసితిమన్నమాట. యమ్. బెర్గ్సన్ తత్త్వమునుగూర్చి విమర్శించుచు నాతనిదొక మతాభిమాన తత్త్వమని "మైండు" పత్రికలో ననేకవ్యాసములు రచించితిని. అదేవిధముగా లైబ్నిజ్, జేమ్సువార్డు, విల్లియమ్ జేమ్సు, రూడోల్ఫు, యూకేన్, హేస్టింగ్సురసదల్, బర్ట్రాండ్ రస్సెల్, లార్డుబాల్ఫర్ మున్నగువారి తత్త్వభావములనుగూడ సమీక్షించితిని. వారి నానాజీవవాదమును సమర్థించినవిధము తత్త్వాన్వేషణములో మతభావములు మిశ్రమమైన కారణముచే సంభవించెనని నిరూపించితిని. దీనినే రెయిన్ ఆఫ్ రిలిజియన్ ఇన్ కాంటెంపరరీ ఫిలాసఫీ (సమకాలిక తత్త్వశాస్త్రములో మతప్రభావము) అను గ్రంథముగా 1920 లో మాక్మిలన్ కంపెనీవారిచేఁ బ్రకటింపఁజేసితిని. దీనికిఁ బ్రేమపూర్వకమైన స్వాగతము లభించినది. సుప్రసిద్ధవిమర్శకులు దానికత్యధికగౌరవము నిచ్చిరి. తత్త్వశాస్త్రవిద్యయందు విఖ్యాతపండితులైన జె. హెచ్. మూరుహెడ్, జె.యస్. మెకంజీ, జె.యి.సి. మెక్ టెగార్టు, మున్నగువా రాదరపూర్వకమైన సమీక్షల నిచ్చినారు. అమెరికా తత్త్వాచార్యుఁడైన హిన్ మెన్ అమెరికాతత్త్వజ్ఞాన సమాజమునకుఁ దన అధ్యక్షోపన్యాసమునిమిత్తము "ఇరువ

రాత్మజ్ఞానవాదులు; బోశాంకే, రాధాకృష్ణన్" అనునది విష యముగాఁ దీసికొనెను. బోశాంకేతోఁ గలుపుట, నాకంటె నున్నతపదవిలో నున్న విద్వాంసులు కోరునట్టి ఘనమైనగౌర వము. భారతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులేగాక, బ్రిటిష్, అమెరికన్ విశ్వకళాపరిషద్విద్యార్థులుకూడ నీగ్రంథమును దమ తత్త్వవిద్యా పాఠ్యగ్రంథముగా వినియోగించుచు వచ్చిరి. తత్త్వశాస్త్రమునుగూర్చి నేనొక రచయితగాఁ గొంత ప్రసిద్ధి నాకుఁ గలిగినది. 1921-వ సంవత్సరములో, భారతదేశములో నత్యంత ప్రసిద్ధమగు తత్త్వాచార్య పీఠమైన కలకత్తా విశ్వవిద్యా లయ మానసిక నైతిక శాస్త్రసంబంధముగల పంచమ జార్జి ఆచార్యపీఠము నలంకరించు పదవిలో నన్ను నియమించిరి. ఎవరిని గూర్చి నేను వ్యక్తము చేయఁగలదానికంటె నధికకృతజ్ఞతను జూపవలెనో ఆ జె హెచ్. మ్యూర్ హెడ్ పండితుఁడు, తన సుప్రసిద్ధ "తత్త్వశాస్త్ర భాండాగారము" నకు భారతీయతత్త్వ శాస్త్రమునుగూర్చి, క్రమబద్ధము, సులభపాఠ్యమునైన యొక గ్రంథము వ్రాయుమని నన్నుఁ గోరినాఁడు. 1908-వ యేఁటి నుండియు నేను జేసిన కృషినంతను గ్రమబద్ధమొనర్చి, రెండు భాగములుగాఁ బ్రకటించితిని. అది యిప్పుడు ద్వితీయముద్రణ ములో నున్నది. అతిసూక్ష్మవివరముల పరంపరలను, సృజనా త్మక సామరస్య సంపుటిగా నిర్మించుట సులభకార్యముకాదు. కేవల విషయములను బేర్కొనుటయే, యీగ్రంథ రచనములో నాయుద్దేశముకాదు; విషయములకు సముచితార్థ నిర్ణయము చేసి, భిన్నదృక్పథ సంబంధబాంధవ్యములను వ్యక్తమొనర్చి,

రచనకు జీవమిచ్చుటే నాయుద్దేశము. మఱియు, సకల తాత్త్వికాగ్ర ప్రవచనమునందును, విజ్ఞానవేత్తలు చెప్పిన ఉత్తమభావములను, అనఁగా వారి కత్యంత స్వచ్ఛమైన జ్ఞానసిద్ధి గలిగిన క్షణములలో వారు రచించిన భావముల ననుసరించియే వారి సిద్ధాంతముల విలువను నిర్ణయింపయత్నించుటే సముచితమైన పద్ధతి. తత్త్వశాస్త్రరచయితలనుగూడ నితర కళాస్రష్టలను వలెనే, ముఖ్యముగా, వారిమహోదాత్తములగు నావేశములపై నాధారపడియే వారిస్థాననిర్ణయమును జేయవలెను. ఒకగొప్ప వైజ్ఞానికు నర్థముచేసికొనవలెనన్నచో, వానిస్థానములోమనము నిలిచి, వానికిఁగల విజ్ఞానవిశేషమును మనదిగా గ్రహించి, వాని విశ్వాసములను నమ్మి, వానియావేశములలోఁ జేరవలెను. మన మధునాతనుల మఱియు, మనకు లేనివి ప్రాచీనులకుఁ గొన్నిలోపములు, కామములు గలవనియు, మనము జ్ఞాపకము చేసికొనుచున్నంతకాలము, ప్రాచీనవైజ్ఞానికుల రూపములు వికృతినొందియే మనకు గోచరించును. వినయమే సర్వరచనలకు జనని; అది తత్త్వశాస్త్రచరిత్రరచనయే గావచ్చును. తిరిగి నేఁటికి హిందూవిజ్ఞానమును విశ్వమానవవిజ్ఞానప్రవాహములోఁ జేర్చుయత్నములోఁ గొంతవఱకు నేను సాయపడితినను సంతోషము నాకుఁ గలిగినది. హిందూవిజ్ఞానము బూజుపట్టి, వికృతినొందిన విచిత్రస్వరూపమనియు, నది లోకమున కాధ్యాత్మిక జాగృతి నిచ్చుకృషిలోఁ బాల్గొనుటకర్హత లేనిదనియుఁ దలఁపఁబడిన దినములున్నవి. కాని అట్టి తలఁపు నెమ్మదిగా నదృశ్యమగుచున్నది. ప్రాచీనభారతీయులు

మనకంటె వేఱైన వింతజనులు కారు. వారిభావములను సరిగాఁ బరిశీలించినచో వారు వేసికొనిన ప్రశ్నలు, వారు చెప్పిన సమాధానములు, అభినవ విజ్ఞానవార్ధిలోనికిఁ బ్రవహించుచున్న మిక్కిలి ముఖ్యములైన భావప్రవాహ వైవిధ్యమును గలిగియున్నవి. నేఁడు భారతీయతత్త్వశాస్త్ర మొక అభ్యసింపవలసిన ముఖ్యవిద్యాశాఖగా నంగీకరింపఁబడెను. 14-వ ప్రచురణమైన ఎన్సైక్లోపిడియా బ్రిటానికా సంపాదకులు సైతము హిందూవిజ్ఞానమునకుఁ గొంతస్థలమును కేటాయించి, భారతీయతత్త్వశాస్త్రమునుగూర్చి యొకవ్యాసమును రచింపుమని నన్నుఁ గోరిరి.

హిబ్బర్టు పత్రికలో నేనువ్రాసిన వ్యాసముల వలనఁ, దత్పత్రికా సంపాదకుఁడును, నదివఱకు ఆక్స్ఫర్డులోని మాంఛెస్టరుకాలేజీ ప్రిన్సిపాలునునైన యల్. పి. జాక్సన్తోఁ బరిచయమేర్పడినది. 1926 వ సంవత్సరములో నాతఁడు తన కళాశాలలో, "హిందూజీవన దృక్పథము"అను విషయమును గూర్చి అప్టన్ ఉపన్యాసములిమ్మని ఉదారబుద్ధితో నన్నాహ్వానించినాఁడు. 1926-వ సంవత్సరము జూన్ మాసములో బ్రిటిషు సామ్రాజ్య విశ్వవిద్యాలయ మహాసభలో స్వీయప్రతినిధిగాను, 1926 సెప్టెంబరులో హార్వర్డువిశ్వవిద్యాలయమున జరిగిన అంతర్జాతీయతత్త్వశాస్త్ర మహాసభలోఁ బాల్గొనుటకును నన్ను కలకత్తా విశ్వవిద్యాలయము పంపియుండుటచే అప్టన్ ఉపన్యాసముల నిచ్చుట కంగీకరింప వీలుకల్గినది. ఐరోపా అమెరికా ఖండములకుఁ బోవుటకు నాకిదియే ప్రథమ ప్రయాణము;

అందుచే నీయాత్రావిషయముల నెంతయో సంతోషముతో జ్ఞాపకముంచుకొంటిని. ఆక్స్ఫర్డు కేంబ్రిడ్జిలయందును, హార్వర్డు ప్రిన్సిటన్‌లలోను, యేల్, షికాగోలలోను, నింక ననేకస్థలములయందును నాకు లభించిన సమోదాంచిత సుస్వాగతములింకను నామనస్సులో బాగుగా నాటుకొనియున్నవి.

హిందూజీవన దృక్పథమును గూర్చిన నాయుపన్యాసములలో హిందూమతమనఁగాఁ జారిత్రికముగా నేఁటికిని వికాసము గాంచుచున్న పురోగమన మని ప్రదర్శించితిని. హిందువు లొకానొక పెన్నిధికి వారసులు గారు; ఒక దివ్య జ్యోతిని ముందుకుఁ గొనిపోవుచున్న పురోగాములు. హిందూమతసంస్థ ననమానము పాలొనర్చి, నేఁటికిని సాంఘికపురోగమనమున కడ్డుదగులుచున్న హిందూమతములోని దొసఁగులు, సంప్రదాయసత్యముల సంబంధము తెలియనిదోషము వలననే జనించినవి. సత్యదృష్టిని మనము నిర్దుష్టముగా నుంచుకొన్నచో నది సంపూర్ణసత్యమునకుఁ దోడ్కొనిపోఁగలదు. "నేను సంప్రదాయము"నని కాక "నేను సత్యము"ననియే పరమేశ్వరుఁడు చెప్పెను. సత్యము దానినుపదేశించు సత్యోత్కృష్ట గురువరేణ్యులకంటె నధికమైనది. జాతిచరిత్ర, నాఁడమూల్యప్రయోజన కారకములైన ఆచారవ్యవస్థలతో నిండియున్నది. కాని నేఁడవియే విషతుల్యములై పరిణమించినవి. నేఁటికిని సజీవములైయున్న మతము పేర జరుగుచున్న అనాచార దుర్వినియోగములను కఠినహస్తముతో ఖండించివేయవలెను. నైతికరంగముననే కాక, పరిష్కారరంగముననను, క్రమోన్నతస్థితికొఱకు యత్నింపు

మని హిందూమతము బోధించుచున్నది. అందుచే హిందూ మతము నిరాశాజనకమనిగాని, పురుషప్రయత్న విరహితమని కాని చెప్పరాదు. వర్తమానములో, గతించినదంతయు నిలిచి యున్నదని కర్మసిద్ధాంతము వక్కాణించుచున్నది. భూతకాల సంస్కారములను, మన మనిచ్ఛాపూర్వకముగాఁగాని, జడముల వలెఁగాని యనుసరింపఁ బూనినచో, మనము వ్యక్తిస్వాతంత్ర్యము నుపయోగించుట లేదనియర్థము. కాని మనవ్యక్తిత్వము క్రియారంగమును శాసించు కేంద్రమైనప్పుడు మనము స్వతంత్రులమని వ్యక్తమగును. హిందూమతమునుగూర్చి చెప్పఁబడిన భిన్నవిమర్శల నన్నిటి నిచట నేను స్మరింపనవసరము లేదు; వలన వానిలో ముఖ్యములైనవానికి భారతీయతత్త్వశాస్త్రములో నాసమాధానము లిచ్చి యుంటిని.

1926–సెప్టెంబరులో హార్వర్డు విశ్వవిద్యాలయమున జరిగిన తత్త్వశాస్త్రమహాసభయందు నేనొర్చిన ప్రసంగములో నభినవనాగరికతలో నాధ్యాత్మికజ్ఞానపిపాస లోపించినదను విషయము ప్రాముఖ్యము వహించెను. "కల్కి" లేక "భావి నాగరకత"యను చిన్ని పుస్తకములో నీభావమును నేను విపులీకరించి యుంటిని. గతించినకొలఁదిశతాబ్దములలో, అధమము బాహ్యలక్షణములలో నైనను ప్రపంచము మిక్కిలి వేగముగాను, సంపూర్ణముగాను మారిపోయినది. మన బాహ్యజీవితమును నిర్మించుటకుఁ బ్రకృతిశాస్త్రము సాయపడుచున్నది; కాని జీవాత్మను సంస్కరించి, పుష్టికర మొనర్చుటకు వేరువిధమగు శిక్షణ మవసరమైయున్నది. విజ్ఞానమునందును, ప్రకృతిశాస్త్రీయ

పరిశోధనములవలన లభించిన నూత్ననిర్మాణములందును, మన మమితముగాఁ బురోభివృద్ధి గాంచియున్నాము. కాని నైతికాధ్యాత్మిక జీవితరంగములో, గతతరములవారి యంతరువు నతిక్రమించియుండలేదు. కొన్నివిషయములలో వారికి మనము తీసిపోయితిమనియే చెప్పవచ్చును. మనస్వభావము లచేతన తుల్యము లగుచున్నవి. ఆంతరంగికముగా శూన్యతయు, సంఘములో నణుప్రాయులమును, మూకలో సభ్యులము నయితిమి. ప్రవర్తనపై నాధారపడిన మనస్తత్త్వశాస్త్రము మానవునిలోపల నేమియులేదనియు, బాహ్యమునుండి చూచువానికి మానవుని గూర్చి తెలియనిదేమియు నుండదనియుఁ జెప్పుచున్నది.

ఇటీవలి సంఘ పునర్నిర్మాణప్రయత్నము లిట్టిప్రమాదములతోఁ గూడియున్నవి. మానవుఁడు ప్రపంచమును తనయవసరముల కిచ్చునట్లు వంచియున్నను, వస్తువుల ఉత్పత్తి, పంపకముల విషయమునఁ బ్రకృతిశాస్త్ర ప్రయోగములవలన మానవజాతి కిహలోకజీవన సౌకర్యములు గలిగి, దారిద్ర్య మనునది భూతవిషయముకాఁగా,నింక నధికసంఖ్యాకులు దుర్భరదారిద్ర్య దుఃఖముల ననుభవించుచున్నారు. ఈ అరాజకస్థితికిఁగారణము సోదరసహకార భావములు లోపించుటయే. జీవితమునకు భౌతికాధారములను గల్పించు వస్తువులను సమానముగా నందఱకుఁ బంచిపెట్టుటకై చేయు ప్రయత్నములలో రష్యన్‌పద్ధతినిగూర్చి మనమెట్లు భావించినను, నది యాత్మశుద్ధిగల ప్రయత్నమని మాత్రము చెప్పకతప్పదు. ఒకచో నైశ్వర్యమును, వేఱొకచో దారిద్ర్యమును గలిగియుండు ప్రత్యక్షవిభేదములుఁ తప్పనిసరివని

వా రంగీకరింపరు. నిరంకుశ నియంతృత్వవిధానమైనను, (Fascism) నిజమైన సామాజికజీవితమును నిర్మించి, పదవీ ధనావకాశముల నందఱకు సమముగాఁ బంచిపెట్టవలెనని యత్నించుచున్నది. కాని దురదృష్టవశమున నీప్రయత్నముల ఫలిత మన్యోన్య కలహము, వ్యక్తిస్వాతంత్ర్య వినాశమునై పరిణమించెను. జీవుల నచేతనులుగాఁ జూచుట, ఆత్మవిశ్వాసము నశించుట, పశువుల గుంపులవలె సంచరించి సుఖసంపాదనము చేయుటకై కోరుట మున్నగునవి పెంపొందుచున్నవి. వ్యక్తి తన యిచ్ఛవచ్చినరీతి దన జీవితమును నియమించుకొను స్వాతంత్ర్యము నపహరించు టయేగాక, తనయిచ్ఛవచ్చినరీతి నాలోచించి, తనయభిప్రాయ ములను, ఆశయములను స్వేచ్ఛగాఁ బ్రకటించు స్వతంత్రతను గూడ నపహరించిరి. సంఘమొక కారాగృహమైనది. జనసా మాన్యమును స్వార్థలాభములకై యార్థికముగా వినియోగించు చున్న విధానము నంతమొందించు నీ తీవ్రప్రయత్నములలో మానవజాతి క్షేమవాంఛ యిమిడియున్నదని మనము నిరభ్యంత రముగా నంగీకరింపవచ్చును. కాని మానవస్వభావములోని నికృష్టతరదుర్గుణములైన స్వార్థపరతా విద్వేషములను, దురహం కారదుర్దమాసహన తత్త్వములను, వినియోగించి, సాధింపఁ బూనిన మానవకల్యాణము పైశాచికమై ప్రవర్తిల్లును. మనము సర్వవిధములచేతను. ధర్మానుగుణమైన ఆర్థికవ్యవస్థను నిర్మిం తము; కాని ఆర్థికమానవుఁడే సంపూర్ణమానవుఁడుకాఁడని మాత్రము గుర్తింతము. పునర్నిర్మాణమందిన మానవ జాతికిఁ జేయు నిష్కామసేవ, భక్తి, ప్రేమలు గలిగి, ఆనంద

ప్రివాహతరంగితము లైన జీవుల విలాసమును సమకూర్చు సద భ్యాసమున నిష్ణాతుఁడే సంపూర్ణమానవుఁడని చెప్పవచ్చును. ఈలోకములో న్యాయధర్మనిత్యానుష్ఠానసిద్ధిని మనముగోరు నెడల, మానవుఁ డాంతరంగికమైన చిత్తశాంతిని సంపాదించు కొనుటకు సాయపడునిమిత్తమే. ఆత్మజ్ఞానములో, నిరక్ష రాస్యత యున్నచో, భౌతికనైపుణ్యమును, అపరిమిత్త పరిజ్ఞా ధురీణతయుఁ బ్రమాదకరములు. ఆల్డస్ హాక్స్లీ రచించిన "ధైర్య నూతన ప్రపంచము," సాధనసిద్ధులమధ్యమునఁ గల పరిపూర్ణ బాంధవ్యస్వరూపమును మనకుఁ జూపును సీసాలలో స్త్రీపురు షులను గనిపెంచుట, కుటుంబజీవిత స్వరూపసంపూర్ణవినాశము, కళాసాహిత్య,తత్త్వమతాదికములైన ఆత్మసంబంధ లక్ష్యసమగ్ర మృతియు నాతని నూతన ప్రపంచములో సంభవించును. వ్యక్తిగతానుభవముతోఁ గూడిన ఆంతరంగిక ప్రపంచము మటుమాయమగుట, అభ్యున్నతి సూచన కాఁజాలదు. నేఁటి నాగరికతయొక్క మరణావస్థ, నైతికాధ్యాత్మిక లక్ష్యము లనెడి బంధము లూడిపోవుటయొక్క ప్రత్యక్షఫలితమే.

అంధయుగములలోఁ దటస్థించిన దారుణదుర్దశలను స్మరింపఁజేయు సందర్భములు నేఁటి నాగరిక ప్రపంచములో జరుగు చున్నవి. దేవునిఁ దొలఁగించి యాతనిస్థానమున నూతనదేవత లైన జాతి,దేశములను నెలకొల్పిరి. సాముదాయిక కల్పితగాథ లచే మానవులయంతరాత్మలు విషపూరితములై,తలక్రిందులుగా నైనవి. అవి వారిని వశమొనర్చుకొని, అమితాశాపాశబద్ధుల నొనర్చి, ఆత్మకంటె ఘనతరమై, బాహ్యమైన గమ్యస్థానము

నకుఁ బోవునిమిత్తము మిక్కిలి తీక్ష్ణము, నిశితరాగాన్వితము నైన శ్రద్ధ నాకాంక్షించుచున్నవి. ఇచ్ఛకు క్రియారూపమిచ్చి, జీవితమునకు జ్యోతిర్మయార్థము నొసఁగు మతములుగా నవి పని చేయుచున్నవి. మానవజాతియొక్క ఏకత్వమును దర్శించి, తమ చుట్టుప్రక్కలనున్న జనుల సుఖదుఃఖములు తమవే యని తలంచు కొలదిమంది సత్పురుషులు, యుద్ధములోఁ దమ బల పరీక్ష జరుగునని నమ్మి పరస్పరవైరము గల జాతులయొక్క సముదాయమే మానవజాతి యని తలఁచు కోట్లకొలఁది ప్రజలచేఁ గప్పువడిపోవుచున్నారు. భిన్నజాతి రాజ్యముల పరస్పర ప్రమాదకరవైరములు, యుద్ధమున కవసరమైన ఆయుధ నిర్మాణములోఁ బ్రబలస్పర్థలై పరిణమించినవి. ఆయుధములు మేముపయోగించుటకుఁ జేయుటలే దను నాత్మద్రోహము వలన లాభములేదు. ఆహారమునుఁ దినుజంతువు మలవిసర్జనముచేయ కుండ నెట్లుండఁజాలదో, అటులే మనమాయుధములను ప్రయో గింపకుండ నుండఁజాలము. యుద్ధప్రయత్నములు, జరుగుచున్న వేగమునుబట్టియు, మానవుల యుద్రేకముల విజృంభణము చెలరేగుచున్న విధానము ననుసరించియుఁ జూచినచో రాబోవు ప్రళయముతోఁ బోల్చినయెడల, ద్వితీయ ప్రపంచమహాయుద్ధ మొక వనభోజనము వంటిదని చెప్పనగును.

ఏది యెట్లైనను, ప్రళయ మనివార్యమని నిశ్చయించి, తన్నివారణోపాయ ప్రయత్నములఁ జేయకుండుట, వివేకము కాదు, మఱియు నట్లూరకుండుటే యుద్ధము నిశ్చయముగా సంభవించుటకుఁ గారణమగును. మానవధర్మములో శాంతి

తప్పఁ దక్కిన దేదియు ననివార్యముకాదు. శాంతియే నేటి ప్రపంచము ఘోషించుచున్న ముఖ్యలోపము. మానవుఁడు నివారించుటకు సాధ్యపడని భూకంపము మున్నగు ప్రకృతిప్రళయములకు రహస్యకారణము లెవ్వియని పెక్కుమంది విఖ్యాత ప్రకృతిశాస్త్రవేత్తలు పరిశోధించుచున్నారు. యుద్ధములు మానవ కల్పితములు గావున, వానికిఁ గారణము లరయుట మనవిధి.

ప్రస్తుత సమాజనిర్మాణములోనే మూల భూతమగు దోషమేదియో యున్నది. అది వలయునంతగాఁ బ్రజాస్వామిక సంఘము గాలేదు. ప్రజాస్వామిక వ్యవస్థకు మూలాధారము మానవ వ్యక్తియొక్క మహానీయోన్నతిని గుర్తించుటే. ఏయొక వ్యక్తికి నింకొకవ్యక్తిపై సంపూర్ణమైన అధికారమిచ్చుటకుఁ దగినంత యోగ్యతలేదనియు నేయొక దేశ మింకొక దేశమును బరిపాలించు నర్హతగలది కాదనియుఁ బ్రజాస్వామికము చెప్పును. ప్రస్తుత జాతీ యాంతర్జాతీయ సంఘనిర్మాణ మెట్లున్నదనఁగా, బలవంతులు వారికి నచ్చినది చేయఁగలరనియు, బలహీనులు తమ దుర్దశల ననుభవింపక తీరదనియు విశదపఱచు నట్లై యున్నది. స్వదేశరాజ్యములందును, సామ్యవాద సిద్ధాంతము నందును గల పరస్పరవిరుద్ధ ప్రయోజనములుచు, అన్యోన్యవ్యతిరేక జీవితప్రణాళికలును, దుర్దశోపహతస్వక్షులకును, సంఘములకు నధిక క్షేమకర భావిదశను గల్పించుటకై చేయుపక్రి నికృష్ట విధానము లని చెప్పవచ్చును. సర్వప్రపంచములోని అక్షరజ్ఞానశూన్యులు, అణఁచివేయఁబడిన వారునైన కోట్లకొలఁది ప్రజ

లలో దుర్నిగ్రహమై నట్టియు నగాధమైనట్టియు నశాంతి చెల రేగుచున్నది. తమహక్కులు పొందవలె నను నూతనజ్ఞానము వారిలోఁ బొడమి, వానినణఁచి వేయుచున్న వారిహస్తముల నుండి బలవంతముగా సంపాదింపవలె నను తీవ్రాందోళనము విజృంభించుచున్నది. ఐరోపాఖండములో నిరంకుశ నియంతృత్వముల కార్థిక నైతిక సాహాయ్యమిచ్చుచున్నవారు, సంఘర్షణము కొట్లాట, అరాజకములతో నిండియున్న ప్రపంచములోఁ బుట్టి పెరిగిరి. ఇఁక జర్మనీ విషయములో బరాజయభ్రష్టతల వలన సంభవించిన రాజకీయావమానము వారి చిత్తమును, హృదయమును దహించుచుండుటచే వారట్లు ప్రవర్తించిరి. ఆశ కవకాశము లేనిస్థితిలో జన్మించిన రాజకీయసాధనములే నియంతృత్వములు.

నానాజాతిసమితి పరీక్షాకాలములో నసమర్థమై అపజయమందినది. మార్పుకావలయునని కోరు జాతులకు వ్యతిరేకముగా యథాస్థితిని నిలుపుటకుఁ బూనుకొనిన బలవత్తర జాతుల చేతులలో నదియొక యుపకరణముగా మారినది. పేరునకుమాత్ర మంతర్జాతీయసమితిగాని, స్వజాతీయస్వార్థపరులచే నది నడుపఁబడుచున్నది. శాంతియనియు, సమష్టిరక్షణమనియుఁ జిన్నదేశముల స్వతంత్రతను గాపాడుట యనియు నిట్టి విషయములఁగూర్చి వారు స్వార్థము గలిసివచ్చినపుడు ప్రసంగింతురు. బలవంతములైన ప్రభుత్వములు తమ సామంతరాజ్యములఁ గాపాడుకొనుటకును, జయించినవారు తమకు లభించిన పరాజిత రాజ్యవస్తుసామగ్రి నారగించుటకును, గల కోరికను "శాంతి

ప్రియత్వము"నియుఁ "స్వజా త్యతీత విశాలదృష్టి"యనియు మనో హరనామములతోఁ జెప్పుచుందురు. జెనీవా నానాజాతిసమితి లోనిపెద్దలు, పూర్వకాల సార్వభౌములవలె, ధర్మస్వాతంత్ర్యము లందరకు లభించులాగునఁ బ్రపంచమును బునర్నిర్మాణము చేయుటకు బదులు, తమచే స్థాపింపఁబడిన అన్యాయ్య విధానములను, కఠినహృదయములతో సమర్థించుస్వార్థపరులై యున్నారు. చరిత్రవిప్లవాత్మకమైనది; నేడు పనిచేయుచున్న నానాజాతిసమితి చరిత్రకు విరుద్ధమైనది. అది, మనోవికాస మును, భావప్రవాహములను, జీవితము కాలము నేదిక్కుగా నేవేగముతో గమనముచేయుచున్నవో యా విధానమును గ్రహించుటలేదు. ఉన్నస్థితిని మార్చివేయుటకుఁ బూను, దురాశాసామర్థ్యములు గల దేశముల రాజకీయరంగములోఁ దాము నిరాటంకముగాఁ బ్రవర్తించుటకు వలయు స్వేచ్ఛకొఱకు సమితి నుండి విడివడిపోవుచున్నారు. న్యాయ్యము మొదటిదనియు శాంతితరువాత వచ్చుననియు వారు ఘోషింతురు. తృప్తి చెందిన దేశములు, బలహీనదేశములును గలిసి నానాజాతి సమితియైనది.

సామంత (వలస) రాజ్యపరిరక్షణములో నార్థికాంశమున కంటె నాత్మగౌరవముతోఁగూడిన మానసిక భావ మధికముగాఁ బనిచేయును. వలసరాజ్యములు సామ్రాజ్యాధిపతులకు లాభస్థానములై యుండఁగా నితరుల కవి ద్వేషపూరిత నిరసన హేతువులగుచున్నవి. ఎంతకష్టమున కోర్చియైనను, దమ సామంతరాజ్యములను నిలుపుకొని రక్షించుకొనుటకై కొన్ని

దేశములకుఁ గల దృఢసంకల్పము, వానిని బలవంతముగాఁ దాము లాగుకొని తీరవలె ననుకొను నితరదేశముల యొక్క సమాన దృఢనిశ్చయమును యుద్ధకారణము లగుచున్నవి. పెద్ద రాజ్యములు, యుద్ధమారంభమైనచోఁ దాము చేయవలయు త్యాగములలో నత్యల్పభాగమును ముందే చేయుట కంగీకరించు నెడల, మనకుఁ దటస్థింపనైయున్న ఘోరవిపత్తునరికట్టవచ్చును. ఈవిషయములో గ్రేట్‌బ్రిటన్ మార్గదర్శి కావచ్చును; ఏలన, నామె రాజకీయవాస్తవికత, పరమార్థలక్ష్య విరహితము కాదు. భిన్న దేశము లిచ్ఛాపూర్వకముగా భాగస్వాములగు నొకసమాజముగా బ్రిటన్ తన సామ్రాజ్యమును మార్పుచేయవలె నని వాంఛించుచున్నది. భారతదేశమున కీయఁబడిన అల్పస్థానము, తన దౌర్బల్యమునకే కారణమగుటయేగాక యితరుల కసూయాద్వేషకారణమగుచున్నది. ఎంతవరకు భారతదేశ మొక స్వతంత్ర ప్రతిపత్తిగల దేశముగాక, బానిసరాజ్యముగా నుండునో, అంతవరకును, ఇటలీ జర్మనీ దేశములు, బ్రిటిషువారింకొక విలాసముహూర్తములోఁజెప్పిన "తెల్లవానిభారము"నందు గొంత భాగమును స్వీకరింపఁగోరుచో వారినే మనుటకును బ్రిటిషువారికి వీలుకలుగదు. ఆఫ్రికాలో ఇటలీవారియొక్కగాని, దూరప్రాచ్యదిశలో జపానువారియొక్కగాని సాహసాక్రమణ కార్యములను ప్రశ్నించు నైతికాధికారము లేకుండఁబోవును. ఎన్ని పరిష్కారములు జరిగినను, సక్రమ ధర్మపరిష్కార మగువఱకును సమస్యలు నిలిచియేయుండును. ఇచ్చి పుచ్చుకొను రాజకీయముల వెనుకకుఁబోయి ధర్మాధర్మములకు సంబంధిం

చిన పారమార్థిక ప్రశ్నమును మనము సమీపించుచో,బలవంత ములైన రాజ్యములు ధర్మనియమములను జీల్చి చెండాడు చుండఁగాఁ జూచి యూరకొనుటయే ప్రపంచ ప్రకంపస్థితికిఁ గారణమని తెలియఁగలదు. ధర్మసూత్ర ముత్తమాధికారము నొందునట్లు చేసి, శాశ్వతశాంతి కనుకూలముగా లోకమును పునర్నిర్మాణ మొనర్చుట కిదియే సమయము.

మనశ్శరీర సంబంధికాక, ఆత్మసంబంధియే నాగరికత. విజ్ఞానము, దానివలన లభించు నధికార పదవియుఁ జాలవు; నైతికాధ్యాత్మిక కర్మాచరణ మవసరము. మానవుఁడొక లక్ష్య శుద్ధిగలిగిన క్రియాశక్తి స్వరూపికావలెను. అప్రయత్నముగా ధర్మము నడచిపోఁగలదనియు, మానవలక్ష్యములు, నిగ్రహ ములు నెట్లున్నను, ధర్మము కార్యసిద్ధినందుననియు నమ్ముట మానవలెను. మానవుఁడు మానవచరిత్రలో నంతర్గర్భితమై యున్న వికాసముయొక్క అసక్తసాక్షి కాఁజాలఁడు; తన లక్ష్య ములను సమీపించురీతిగాఁ బ్రపంచమును బునర్నిర్మాణము చేయు కార్యక్రమ ప్రతినిధియే మానవుఁడు కావలెను. ప్రతి శకమును, చాలనజకు మనముఁ చేయుగోరినదే యగును. మన నాగరికతలోని దోషమేమనఁగా, (దాత్కాలిక వస్తుసంపాదనకై మనముపొందు ఆతురముకోఁబాటు, శాశ్వతములు, అవినాశ ములునైన వస్తువులను నిర్లక్ష్య మొనర్చుచుంటిమి. ఇహలోక రాజ్యసేవచేసినంతమాత్రముననే మానవ జీవితార్థము సంపూర్ణ మగుటలేదు. బహుశాంశాసమ్మిశ్రితమైన మానవజీవితము శాశ్వత వస్తువాసనాన్వితముగా నున్నచో. తృణప్రాయము,

లక్ష్యశూన్యము, అసంతుష్టికరమునగును, పారమార్థిక సత్యమును సమాశ్రయింపని యిహలోక జీవితము నిరర్థక మను మహత్తరసూత్రమును మనసునందుంచుకొని, సర్వముతో సంబంధము జ్ఞాన బాంధవ్యముగా నిర్మించుకొనవలసి యున్నది. పెంపొందిన ఋజుత్వము, సత్యనిరతి, స్వార్థ రాహిత్యము నాగరికతాభివృద్ధికి సాక్ష్యములు. వ్యక్తులలోఁ బరివర్తనము కలుగఁజేయు మిక్కిలి మందము,కష్టము నైనపద్ధతియే,సంఘపరివర్తనమునకుఁగల యేకైకపద్ధతి. సహనముగల శ్రమవలనను, యత్నము వలనను, ప్రథమ విషయములకుఁ బ్రథమ ప్రాధాన్యమిచ్చిన యెడల, మనముపరిస్థితులపై నధికారపదవినంది, వానిని నియమించు సమర్థుల మగుదుము. నైతికాధ్యాత్మిక లక్ష్యముల సిద్ధికొఱకై యత్నించు మానవజాతిమాత్రమే, నాగరికతయొక్క నిజాదర్శముల సాధనకై ప్రకృతిశాస్త్రీయ విజ్ఞాన విజయముల నుపయోగింపఁగలదు.

ఆక్స్ఫర్డులోని మాంచెస్టర్ కళాశాలకుఁ బ్రధానాచార్యుఁడైన జె.ఎస్ట్లిన్ కార్పెంటరు విరమింపఁగా, నాస్థానము నాక్రమింపుమని నన్నాహ్వానించినప్పుడు 1929 లోఁ దాత్త్వికజ్ఞానమాధారముగా నీ పైభావములను వ్యక్తీకరించు నవకాశము కలిగినది. మఱియు ఆక్స్ఫర్డు విశ్వవిద్యాలయ విద్యార్థులకు, భిన్నమతస్వరూపములను గూర్చి యుపన్యసించుటకీ యాహ్వానము నాకవకాశమిచ్చినది. ఈయాత్రయందే లండను, మ్యాంఛెస్టరు విశ్వవిద్యాలయములలోఁ బెద్ద పెద్ద సభలలో "పరమార్థ

జీవిత దృక్పథము"ను గూర్చి, హెబ్బర్టు ఉపన్యాసములు కూడ నిచ్చుట కవకాశముగలిగినది. తత్త్వశాస్త్ర మూలసమస్యలఁ గూర్చి కొంతవఱకు నాభావముల నీయుపన్యాసములు వ్యక్తీకరించును. ప్రపంచములో మార్పుచెందిన వైజ్ఞానికవాతావరణమును, మతమును, సాంఘిక జీవితమును బొందుచున్న అరాజక స్థితియు మనసులో నుంచుకొనియే నే నుపన్యసించితిని. మోసముచేయు కృత్రిమమాంత్రిక విధానములతోఁ గూడిన బాహ్యాకర్మాడంబరమైన మతమునకుఁ గాలము గతించిపోయినది. మతములో నేమైన సత్యమున్న దాయని ప్రజ లడుగుచున్నారు. జీవితముయొక్క అగాధములైన లోతులలోనికిఁ బోయి అత్యంత పురాణసత్యమును మఱుఁగుపఱచిన తెఱలను త్రెంపివేసి, సత్యధర్మజీవితముల కవసరమైనదానినిఁ దెలియఁ బ్రజలు కోరుచున్నారు. సంకుచిత జడాత్మక మత వినాశము వలన, కొన్ని మతస్థానము నాక్రమించు పర్యాయ తత్త్వములు బయలుదేరినవి కాని,అవి మానవుని యంతరాత్మయొక్క అనంత గాంభీర్యము నెఱుఁగనివయ్యెను. వ్యవహారవిజ్ఞానము మతస్థానము నాక్రమింపఁజాలదు.

ఆధునిక నాగరికతయు నిట్టి ఆత్మవిరహితమైన లోపమునకుఁ బాల్పడినది. రాజకీయార్థిక వ్యవస్థలు,నీతిమతసూత్రములు జూపు బాటననుసరించుటలేదు. ఈవిధముగాఁ గోల్పోయిన 'ఆత్మ'ను దిరిగి మానవ జీవితమునకుఁ జేకూర్చవలయుచో, మన విచక్షణాధికారమును విడువ నవసరములేనట్టియు,బూర్ణ

స్వతంత్రులు,విగతభ్రాంత చిత్తులు నైన వారుకూడ నంగీకరింప దగినట్టియు నొక సూత్నశక్తియుక్తమైన మతమును మనము నిర్మింపవలసియున్నది.

మతమొక సంకుచితశాఖగాని,సూత్రసంపుటిగాని కాదు, అది పరమార్థదర్శనము, అదియొక బుద్ధిగతభావ మని మనము పొరపడినచో, దేవునియొక్క భిన్నరూప నిర్వచనములలో నేదిసత్యమో నిర్ణయించు నిమిత్తము, సాయుధప్రజావర్గములు కాట్లాడిన విధానమును మనము సమర్థించిన వార మగుదుము. మతస్థాపకులును, యోగులును, జ్ఞానులును, మన యింద్రియ ముల కతీతమైన పరమసత్యముతోఁ బ్రత్యక్ష పరిచయముగల మహాద్రష్టలు.

నిశ్చయాత్మ విశ్వాస మాత్మ జ్ఞానమువలననే గాని, చిత్తేంద్రియ దృష్టివలన లభించునదికాదు. ఈయాత్మజ్ఞానము తర్కానుగుణమైనదికాదు;తర్కాతీతమైనది. దానినే అంతర్వి లోకనము లేక ఆత్మావలోకనమని చెప్పనగును. విచక్షణజ్ఞాన మను నర్థములో హేతువున కుత్తమస్థానము నిచ్చిన హెగేల్ మున్నగు తార్కికుల నిర్ణయము నిర్దుష్టముకాదు. మన యుగ లక్షణమును, మనకాలములోని ప్రధాన కార్యపద్ధతులను బట్టి చూచినచో, నొకశాస్త్రీయమగు తార్కికపద్ధతియే సముచిత మని తోఁచును. మననాగరికత, నేటివైజ్ఞానికుల దృష్టిని మహా శక్తితో మన కత్యంత సమీపమునున్న కేవల భౌతిక వస్తు సంపద నుపయోగించు పద్ధతుల నన్వేషించుటకు మరల్చు చున్నది. నాగరికత చరిత్రలో సాంకేతిక భౌతిక విషయము

లపై నట్టి గాఢమగు కేంద్రీకరణ ముండుట నిజముగా నదృష్ట పూర్వమైనది. విశేషముగా నది మానవకోటి కుపకృతి రొనర్చినమాట నిజమే, కాని గణితప్రకృతి శాస్త్రముల భావములను,పద్ధతులను వినియోగించుకొను వారైనను, ప్రకృతిశాస్త్ర విజ్ఞానమునకుఁగల విలువయు, నవధులనుగూర్చిన యింకొక ప్రశ్నకూడ వేసికొనవలసియున్నది. ప్రకృతిశాస్త్రసిద్ధాంతములు ప్రకృతిని నిగ్రహించుటకుఁ బనికివచ్చు నుపకరణములే, కాని పరమార్థస్వరూపమున వ్యక్తీకరింపఁజాలవు. ఎలెక్ట్రానులు, ప్రోటానులు పరమార్థ రహస్యము నావిష్కరింపఁజాలవు, మఱియు నాత్మయు దేవుఁడును గణితశాస్త్రమునందలి భిన్నాంకములుగాఁ జెప్పసాధ్యపడవు. కొన్ని వేళల మనము వేనికొఱకై ప్రాణపరిత్యాగము చేయుటకును సంసిద్ధుల మగుదుమో అట్టి మన అత్యంత గాఢ విశ్వాసములు తర్కగణనముల ఫలితములు గాఁజాలవు, వ్యక్తిగతమైన నిశ్చయానుభవములు సూత్రములలో రూపొందవు, వానికిఁగల ప్రచండచోదనశక్తి, సత్యముతో మనకుఁగల సద్యస్సన్నిహిత స్పర్శలవలననే కలుగును. అవి మన జీవితములను మార్చివేయు నిగూఢ నిశ్చయములను మనకిచ్చును. ఎట్టిశాస్త్రీయహేతువాదమైనను, అట్టి యనుభవములయొక్క యాథార్థ్యమును, కేవల శాస్త్రీయ జ్ఞానముయొక్క అసమగ్రతను, అయథార్థతను మన మంగీకరించుటయే యవసర మని తెల్పును. సంపూర్ణ జ్ఞానము లేక, అతీంద్రియ జ్ఞానముగలదను సత్యము, మన మానస స్వభావముచే సత్యదర్శనము మనకు దుర్లభ మని నిశ్చయింపఁజాలదు.

విభాగశీలముగల బుద్ధికి సత్య సందర్శనము సంభవింపదనియు, తపస్సుచే సంశుద్ధిగాంచిన చిత్తమునకుమాత్ర మది గ్రాహ్యమనియు హిందూతత్త్వశాస్త్రము మొదటినుండి చివరవరకును జెప్పుచున్నది. ఈనిర్ణయము విషయములో హిందూవైజ్ఞానికులను, ప్లేటో, ప్లాటినస్, సెయింటుపాల్, సెయింటు ఆగస్టైన్, లూథర్, ప్యాస్కల్ మున్నగు వారు సమర్థింతురు. నిత్య నూతనవస్తు సృష్టిచేయుటే జగత్పరిణామ స్వభావమని చెప్పు అభినవ ప్రకృతిశాస్త్రవాద మతీంద్రియదృష్టి కావలసియున్నదని సూచించుచున్నది. జీవితమొక రేఖాగణిత చిత్రము వంటిదిగాదు. సృజించుటే జీవితసారము, అది నూత్నమైనయొకసజీవసృష్టికాని, నిర్జీవకార్యకారణ సంబంధరూపముగాదు. మన నేత్రములకు గోచరించు దానికింకను వెనుక నిలిచియున్న ఆంతరంగిక శాసనశక్తి. మన నిజస్వరూప మను విధానమున గుప్తమైయున్న యొక నూత్న విషయమును సృజించి, మొలకెత్తించి. జీవింపజేయుచుండును. సృష్టిసామర్థ్యముగల ఆత్మశక్తియొక్క పరిమితులను మనము విభాగపద్ధతిచే నెన్నడెఱుంగజాలము, పరమార్థమొక నిజమైన పరిణామమైనచో నుత్కృష్టతమజ్ఞానమొక యంతర్విలోకనమే యగును, ఈ యంతర్విలోకనములో వలసినంత హేతువాదమున్నది. నిజమైన సంబంధమను గొలుసులోఁ దెగిపోయిన చోటెచటను లేదు; కాని మన యల్పదృష్టికి, దానిలో నిమిడియున్న కార్యకారణ పరంపర గోచరింపకపోవచ్చును. ప్రపంచమొక సృష్టివ్యాపారమే; కాని యది అవిచ్ఛిన్నము, సహేతుకమునైనది, ప్రపంచములోని

హేతువిధానము బుద్ధికి గోచరించునదే కాని, ప్రపంచ రహస్యము మాత్ర మతీంద్రియదృష్టికే గోచరించును.

కొన్ని వేళల బెర్గ్సన్ చెప్పినరీతిగా, అతీంద్రియజ్ఞానము, బుద్ధిజ్ఞానమునకు వ్యతిరేకముగాదు అతీంద్రియజ్ఞాన మనఁగా నింద్రియపారవశ్యముగాని, ఉద్రేకసమాధిగాని కాదు. అతీంద్రియ విలోకనములో బుద్ధికిఁ గొంతభాగమున్నది. బుద్ధ్యతీత జ్ఞానము హేతువాదముచేఁ బోషింపఁబడకున్నచో నదిస్వయం సంతుష్టిగల వ్యక్తిగతాస్వాదముగాఁ బరిణమించును, సర్వానుభవైక్యతను, అవిచ్ఛిన్నతను నింద్రియాతీతజ్ఞానము తనలో నిముడ్చుకొనియున్నది. వస్తుమూలకారణము కొఱకై చేయు బుద్ధిగతాన్వేషణము, మనల నీశ్వరభావమునకుఁ దోడ్కొని పోవచ్చును. అనుభవజ్ఞానమట్టి భావము కేవలమానసిక కల్పనము గాదనియుఁ బరమసత్యమేయనియు నిర్ధారణచేయును మహాత్ములైన ప్రవక్తలును, మతానుభవసిద్ధిగాంచిన పరిజ్ఞాధురీణులును, జగద్రహస్యములఁగూర్చిన సత్యాంశములను దర్శింతురు. అట్టి సత్యాంశములు భాషలోనికి సంపూర్ణముగా రాఁజాలవు. బుద్ధిజ్ఞానవిలసితములైన మతశాఖ లట్టి యసంపూర్ణ పరికటనము లగుటచేతనే, వానికప్పుడప్పుడు పరస్పర విరోధము లేర్పడు చుండును.

మానవుడు తనయంతర్గతమైయున్న ఆత్మశక్తిని రగుల్కొల్పి, దేహమనఃప్రాణాదికముల నన్నిటి నాకర్షింపఁ జేయవలెను. ఇదియే మానవకర్తవ్యము, స్వార్థపరమైన అహంకార వినాశముతో నిగూఢమైన నిజాత్మదర్శనము

లభించును ప్రకృతిగుణవాంఛ సముచ్చయమే మానవుఁడు గాఁడు. ఆతఁడొక అవిభాజ్యమగు నేకత్వమూర్తి. ఈ మూర్తిలో సంపూర్ణైకత్వమున కెప్పుడు లోపము సంభవించినను దానితోఁ బాటు అశాంతియు, నసంతుష్టియుఁగలుగును. మనము నేడున్న పరిస్థితికిని, మనము కావలయు భావిస్థితికిని సంఘట్టన మెల్లప్పుడుండును. జీవాత్మ అస్థిమితమైన తాత్కాలిక నిర్మాణము, జీవితాధారభూతమైన జడపదార్థమునకును, బరమార్థవ్యక్తిత్వమును సమకూర్చు నాత్మశక్తికి మధ్యమందు జీవాత్మ ఊగిసలాడుచుండును. అది రెంటికిని సమన్వయసిద్ధి గూర్ప యత్నించుచున్నది.

సమన్వయసిద్ధి గాంచిన జీవులు ధన్యతజెందినట్లే. అట్టివారు అనిర్వచనీయమైన ఆనందమును, బుద్ధి కగ్రాహ్యమైన శాంతినిగాంతురు. ఉదయించు సూర్యమండలము నెదుట విద్యుద్దీపములవలె నట్టి బ్రహ్మానందమునెదుట నిహలోకసౌఖ్యములుండును.

తమ జీవితానుభవములో నిట్టి సమన్వయసిద్ధిగాంచి, తమ వ్యక్తిత్వములను సమగ్రమొనర్చుకొనువారి వలననే నూతన మానవసమాజము స్థాపింపఁబడును. ఆంతరంగిక సమన్వయసిద్ధియు బలమును సంగ్రహించినవారికి లోపభూయిష్ఠమగు మానవసమాజము సవాలుచేయుట దగును. వారు తమ ఆత్మత్యాగముచేత నీలోకములో, ప్రేమధర్మ దైవరాజ్యస్థాపన మొనర్తురు. సంఘమంతయు సంపూర్ణత నందువఱకు నిజముగానే

వ్యక్తియు ముక్తుఁడుగాఁడు. అనాదియగు సంసారక్రమమును భారముగాభావించి, దాని బంధములనుండి విడివడవలయు నన్నచో సంసారము సమగ్రపరిణతి గాంచుటవలననే విముక్తి లభింపఁగలదు. బలవంతులైన వ్యక్తులు బలహీనులకు సాహాయ్య మొసర్చుచుఁ బోవుచో నందరును రక్షింపఁబడుదురు. సర్వజీవ మోక్షప్రాప్తియే సంసారపరిణామ ప్రవాహమునకు లక్ష్యము. ఈలక్ష్యము సిద్ధించుటతో నవియు నదృశ్యమగును. కాలవశమై నది కాలాతీతమగును.

అనంత పరమాత్మలోని యొక విశిష్టమగు రూపమున కావిష్కృతినిచ్చుటే చరిత్రయొక్క పని. అట్టిసందర్భములోఁ బరిణామ జగత్ప్రవాహమునుపట్టి నడపుచున్న యొక దైవశక్తి యున్నదని మనము గ్రహింతుము. పృథగ్వ్యక్తులుకలిసి మాయ మగు నొక మహాశాంతి సాగరమువంటిదికాదు దేవునిరూపము; ఆదిమధ్యాంతములందు, సర్వకాలములయందు నీపరిణామ చక్రము నాతఁడే నడపుచున్నాఁడు. జగత్తును దేవుఁడు సృజించె ననుట, మిక్కిలి అల్పమైన సత్యము ఆతఁడిప్పుడును సృజించు చున్నాఁడు; అనంతముగాఁ జేయఁగలఁడు. ఈయర్థములోఁ జరిత్రము దైవసంకల్పముయొక్క యితిహాసము; దైవస్వరూప ప్రదర్శనమే ఈశ్వరుఁడు మన యిహలోకద్వారమునఁ బనిచేసి, ప్రకాశించును హిందూమతములో నీశ్వరుఁడనఁగాఁ గవి యనియు, నీ జగత్తను కావ్యకర్త లేక కావ్యసృష్టికర్తయనియుఁ జెప్పుదురు. దేవుఁడొక వ్యక్తిగా నీప్రపంచవిషయముల కెంతయో గాఢమైన సంబంధమును గలిగియున్నాఁడు. ఆతఁడు మానవ

జాతికి మిత్రుఁడు, న్యాయాధ్యక్షుఁడు, మోక్షదాతయునై యున్నాఁడు భగవంతుఁడు నిర్గుణపరమాత్మ, కాలాతీతుఁడు, మానవదృక్పథము లేక ప్రపంచదృక్పథమునుండి నిర్వికారుఁడు. భగవానుని ద్వారముననే మనము నిర్గుణబ్రహ్మరూపమును జూచి యెఱుఁగుట కవకాశముండుటయేగాక జగత్పరిణామములో నా బ్రహ్మముపనిచేయు మార్గముకూడనైయున్నాఁడు. నిర్గుణబ్రహ్మము, అనంతావకాశములకు మూలాధారమైనది. సముచ్చయకేంద్రమైనది, అందొక యవకాశము మన జగత్పరిణామము, లక్ష్యసిద్ధి గాంచనైయున్న యీ అవకాశమును ఫలింపఁజేయుటకు, నిర్గుణబ్రహ్మ మీశ్వరుఁడై, దివ్యదృష్టితో జగత్తుయొక్క రూపగమనముల నెఱిఁగి నడపుచున్నవాఁడు. భగవంతుఁడు మన మనస్సులచేఁ గల్పితుఁడుగాఁడు. పరమ సత్యమైన పరబ్రహ్మముయొక్క యథార్థచిహ్నమే దేవుఁడు. పరిపూర్ణతనందుటకు ముందుకుఁబోవుచున్న ప్రపంచమా నిర్గుణ స్వరూపములో నొక యంశము. ఈశ్వరుఁడు నిర్గుణబ్రహ్మము యొక్క భ్రష్టమైన ప్రతిబింబమువంటివాఁడుగాఁడు; కాని లైబ్నిజ్ చెప్పినవిధమున, వాస్తవికతపై నాధారపడిన దివ్య రూపమే యాతఁడు. ఈశ్వరుఁడును జగత్తును సమానమైనప్పుడు, అనఁగా నీశ్వరోద్దేశము ఫలసిద్ధిగాంచినపుడు జీవకోటి పరిపూర్ణతనొందినపు డీశ్వరుఁడును దనరూపమును జాలించి, నిర్గుణ బ్రహ్మములో విలీనతనందును. ఈరీతిగా, "పృథక్త్వ మందవలెనను నుత్సాహము సృష్టిని కల్పించి, పెంచి, అదృశ్యమగునట్లుచేయుటలో విరతి నందినది." జగత్తు లయమందుట

వలన, నిర్గుణ బ్రహ్మములోని యనంతత్వమున కేపాటి లోటును వాటిల్లదు.

హిబ్బర్టు ఉపన్యాసములలో నేనుజేసిన విశేషప్రసంగముల సారాంశమిచట నిచ్చితిని. ఈ నా ప్రసంగములెంతో ఆదరణ పాత్రములగుట నాకు ముదావహమైన విషయము. యిరోపా, అమెరికా ఖండములలోని సుప్రసిద్ధ తత్వవేత్తలును, సామ్యూల్ అలెగ్జాండర్, బెర్ట్రాండ్, రసేల్, జె. హెచ్ మూరుహెడ్, జె. యస్ మెకంజి, డబ్లియు, ఆర్. ఇంజ్, యల్. పి. జాక్సు, రవీంద్రనాధ టాగూరు, సర్. హెర్బర్టు శామ్యూల్ మున్నగువారు నాప్రసంగముల నమితాదరాభిమానములతో మన్నించిరి.

నేనాక్స్ఫర్డులోనుండగా నవ్వాడప్పుడొసగిన యుపన్యాసములును, సల్పిన ప్రసంగములును "మతమునందు పూర్వ పశ్చిమఖండములు" (East and West in Religion) అను గ్రంథముగాఁ బ్రకటితమైనది. న్యాయ్యముగాఁ బ్రవర్తించుచు ప్రేమ పూర్వకమైన దయతోఁ దోడిమానవులకు సౌఖ్యము చేకూర్చుటయే మతముయొక్క సారాంశమని నాయీ యుపన్యాసములలోఁ జెప్పియుంటిని. ఒకజ్ఞానసిద్ధుఁడనఁగా రంగులుపూసిన అద్దములోని అందమైన బొమ్మవంటివాఁడు కాడు; అతఁడు పరోపకారపరుఁడై, ప్రజాకోటిలోఁ బ్రేమయుదయయుఁగల సంబంధములను స్థాపించును. ఒక మానవుని యవసరమే తనదాత్మీయత్వమున కవకాశమని యాతఁడు తలంచును. ఆత్మస్వరూపమందరలో నొకటేయనియే కాకుండ, శారీరకముగాను మనమందర మొకటే

యని నమ్మవలెను. నిజమే మనమొక జడపదార్థమునకుఁ బ్రేమ చూపలేము. మానవప్రేమ యనఁగా, మనతో సన్నిహితసంబంధముగల స్త్రీ పురుషులను మన మనురాగముతోఁ జూడవలెను.

ఆక్స్‌ఫర్డ్, బర్మింగుహాములయందును, మ్యాంచెస్టరు లివర్పూలులయందును క్రైస్తవ వేదికలపైనుండి నేనుపదేశములు చేసియుండుట నాకొక గొప్పయనుభవము. నా ప్రసంగములను క్రైస్తవసభ్య సమూహములు విని మెచ్చుట నాకమితోత్సాహకారణమైనది. "దుఃఖానుభవము ద్వారమున విప్లవము"ను నా యుపదేశమునుగూర్చి, ఒక ఆక్స్‌ఫర్డు దినపత్రిక యిట్లు సమీక్షించెను; "సమాలోచనము, ఊహాసామర్థ్యము, భాషా వైదుష్యములను మేళవించి, మాంత్రికునివలె నొక యింద్రజాల ప్రదర్శనమునల్లు అత్యద్భుత సామర్థ్య మీభారతీయ ప్రవక్తకుఁగలదుగాని, మనదృష్టినరికట్టి, హృదయమును గదలించి, మహోన్నత వాతావరణమునకు మనలను లేవనెత్తు నొక అనిర్వచనీయాధ్యాత్మిక లక్షణములో నీ మహనీయుని మహోపదేశమహత్త్వ మిమిడియున్నది."

# ౪ జీవిత సమస్యలు

జీవితమెవరికి దయచూపునో వారు తమయదృష్టమును సామాన్యవిషయముగాఁ దలఁపరాదు. మన చుట్టుప్రక్కలనున్న పెక్కుమంది, మనకున్న యవకాశములు లేనివారై, విషమ పరిస్థితులలో మ్రగ్గుచు, విషాద విఘాత హతులగుచున్న

సంగతి నాలోకించియు, మనము సురక్షితముగా నుంటిమని సంతసింపక వారినిగూర్చి సర్వకాలములయందును దలపోయు చుండుటయే మనవిధి. కాలుష్యమెఱుఁగని లేతవయస్సులోనున్న యువతీ యువకులతో, నుపాధ్యాయుడనైన నాకు సన్నిహిత సంబంధమేర్పడెను. లక్ష్యములోఁ గేవలము ప్రధానముగా ప్రయోజనకరముగాని తత్త్వశాస్త్ర విషయము, ఉదారవిద్య కుత్కృష్టమైన యుపకరణము, ప్రపంచమునుండి ప్రపంచాతీత పదవికి దృష్టిని మరల్చుటయు, బరిస్థితుల నతిక్రమించు శక్తి నాపాదించుటయు, మానవాత్మను భౌతిక బంధములనుండి విడివడఁజేయుటయు, తత్త్వశాస్త్ర లక్ష్యమై యున్నది. స్వభావ ముచేఁ బరచింతాపరాయణులైన వారికి దానియుపదేశ ప్రభావములచే లాభమునొందునట్లుచేయుటకును, ఈలోక మిచ్చుటకుఁగాని తీర్చివేయుటకుఁగాని వీలులేని విషయములం దభిరుచి నుదయింపఁజేయుటకును దత్త్వశాస్త్రము జన్మించియున్నది. సక్రమముగా దానినెఱిఁగినచోఁ బరాజయ దుఃఖములను, ప్రమాదాలస్య నిరుత్సాహములను జయించు నాయుధముల నది మనకిచ్చును. భౌతికమైన సంపదను గూడఁబెట్టుట యను నర్థములో విజయశబ్దమును దీసికొన్నచో నదిమనకట్టి విజయముల నీయలేకపోవచ్చును. ఐహికవిజయములమీఁదనే దృష్టిగల ప్రజాకోటి, లోకోత్తరములైన యేవస్తువులకొఱకును, ఆదర్శములకొఱకును, హృదయమునిచ్చి యెన్నఁడును కృషిచేయరో వానిని మనము ప్రేమించునట్లు తత్త్వశాస్త్రముచేయును. పూర్ణమానవ నిర్మాణమే తత్త్వశాస్త్రలక్ష్యము.

నా విద్యార్థులతోఁగలిసి కాలముగడపుట కదృష్టము పట్టిన ఘడియలలో నైతికాధ్యాత్మిక ప్రపంచమున్నదను విశ్వాసమును వారికిఁగలిగించుటయే నాయాశయముగా నుండెడిది. కేంద్రిసత్యములైన ఆంతరంగికధ్యానము, దానము, నివృత్తి పరతంత్రితయుఁ బ్రేమయు, మనభావములై, హృదయములలో బ్రవేశించినచో, దరువాత జీవితములో మనలనెదుర్కొను నాస్తికభావము దుర్బలమై మనచే నోటమినొందితీరును. మన శిష్యకోటి హృదయములలో నేకాంతముగా నుండుటకై వలయు ప్రశాంతమైన యొకవేళయు, జిత్తహృదయములకుఁ బరిశుద్ధమైన నూత్నశక్తినిచ్చుకాలమును, దమయూహల నొకచోఁ జేర్చి, వ్యక్తిత్వములఁ బునర్నిర్మాణమొనర్చికొని, తమ్మునుదాము తెలిసికొను నవకాశమును గలుగఁజేయుట మనకర్తవ్యము. అట్టి యేకాంతమునందు నాకీ బంధమునుండి స్వేచ్ఛనొసంగుమని దీనముగా నాక్రోశించు కారాగారవాసి యార్తనాదము వలె, ఆత్మయొక్క ప్రశాంతములగు వాణీప్రసంగములు మనకు వినవగును. ఆ నినాదము దేశాంతరగతుని స్వగృహ గమన కాంక్షను దెలుపు ధ్వనియై, జీవాత్మ పరమాత్మకై చేయు విలాపమువలెనుండును. మన మేకాంతముగా నున్నప్పుడు మనతో మనమెట్లుందుమో యదేమతము. మనలోఁ బ్రతివ్యక్తియందు నొకరహస్యమైన దేవాలయమున్నది. అందెవరును మన యను మతిలేనిదే చొరఁజాలరు. మనమా దేవమందిరములోనికి వీలగునన్నిమారులు పోవుచు, మనము బాహ్యప్రపంచ దృష్టికి గోచరించుచున్న మన స్వరూపములకు వేరై మనసిజస్వరూప

మేమో తెలిసికొనవలెను. మనమందరము నాత్మద్రోహులము; నిత్యాత్మపరీక్షయే మనలను రక్షింపఁగలదు. మన జపమున కంతటికి మౌనపూర్వకముగా దైవసాంగత్యమే ముఖ్యభాగము.

బైబిలు గ్రంథమొక ఆశ్చర్యకరమైన వాక్యమును జెప్పినది. దేవుని దివ్యసింహాసన సన్నిధిని దేవతలు పూజచేయుచున్నారు. హఠాత్తుగా "స్వర్గములో నొకయరగంట కాలము నిశ్శబ్దమైనది." గాయకుల కంఠధ్వనులాగినవి; స్వర్లోక నటీమణులు నృత్యశబ్దములు శాంతించినవి. ఈ నిశ్శబ్దత, నిర్జీవమైనది కాదు; ఈశ్వరవాణిని వినుటకై మాట్లాడుటమాని, మౌనముతో వేచియున్న దేవతలతోఁగూడిన సజీవశాంతియది. అట్టి శాంతిలోఁ బరమార్థమును సమీపించి, దైవమునకు మన మెట్లాత్మార్పణముచేయఁగలమో తెలియుదుము.

ఆరాధనమనఁగా నుపవాసములు, ప్రార్థనములుగావు. పశ్చాత్తప్తమైన పవిత్రహృదయ సమర్పణమే నిజమగు నారాధనము. మృగమునాభియందే కస్తూరికలదు. కాని పరిమళమెచటనుండియో వచ్చుచున్నద తలచి, లేడి, నిర్వ్యాకాముముగా గంతులిడును. దేవుఁడు మనలోనున్నాఁడు; మనము మనలోపలనే యన్వేషించినచో సత్యము తెలియఁగలదు. దైవారాధన నిమిత్తమై, పువ్వులెచట దొరకునాయని, లోతైన చెరువులలో మునిగియు, దుర్గమారణ్యములఁజొచ్చియు, బర్వతశిఖరముల నధిరోహించియు, మూర్ఖమానవుఁడు తడవులాడును; కాని నిజముగా నీశ్వరునకు సమర్పింపవలయు జలజరాజమువాని హృదయకమలమే, మానవుఁడు తనజీవితమునే

నిత్యార్పణముగా జీవింపవలెను. అపవిత్రము, నపరిశుద్ధము, కుటిలము, భగ్నమునైనదేదియు నీశ్వరున కర్పింపరాదు. "దేవాలయము పావనమైనది; ఆ దేవాలయము నీవే!" మన చుట్టునున్న అరాజక పరిస్థితులలో మనమొక పరమావధిని నిర్ణయించి, మనకు జీవితములో సంభవించు వివిధ విషాద విషయములన్నిటిలో నది ప్రత్యక్షమగుచుండునట్లు యత్నింపవలెను. కానియెడల, నెట్టి విశిష్టలక్ష్యముతోడను సంబంధము లేక, అర్థరహితముగా బుట్టి, అర్థరహితముగా నదృశ్యమగు నిష్ప్రయోజన కథాపరంపరవలె జీవితము వ్యర్థమగుగు. జీవితమున కర్థమిచ్చి, విలువనొసగున దేమనగా దనవికాసము నరికట్టు నాటంకములెన్నియున్నను నిశ్చంచలదీక్షతో నుద్దేశ సిద్ధికై పురోగమనముచేయు లక్షణమే. వ్యక్తిగతమైన మానసము, తలపెట్టించిన విషయముల కుత్సాహము, నర్థము, లక్ష్యము, విలువ నాపాదించును; కాని వీనిని జీవితములో నాచరించుట కప్పుడప్పుడు కొన్నియవకాశములు లభించును. ఆత్మానుసంధానము గల ప్రశాంతసమయములలో మనము, మన కూపిరియాడకుండ జేయుచున్న దైనికకార్యపరంపర నుండియు, మనము పైని గప్పుకొన్న వేషభాషాది కాచ్ఛాదనములనుండియు బయటపడుటకు యత్నించి భావములను సంశుద్ధము లొనర్చి, హృదయచిత్త పావనత్వమును గల్పించుకొనుటకు గృషిచేయుదుము. బాహ్యాభ్యంతర జీవితముల కభిన్నతను జేకూర్చు యోగవిద్య నభ్యసించుటకు మౌనధ్యానాత్మస్వరూప సంస్మరణములే ముఖ్యసాధనములు.

నేను జేసినపని వ్యర్థమైనదికాదని తెలిసికొనుటచే నాకు సంతసము కలిగినది. ఏది జగత్తునకు మూలసత్యమో దానిని నిత్యజీవితములో జీర్ణించుకొని, భావములో నిలుపుకొనవలెనని కొలఁదిమంది స్త్రీపురుషులు నిశ్చయముగాఁ దెలిసికొనఁగల్గుటకు సాయపడితిని. చిత్తశాంతి గలిగి, సర్వప్రాణులయెడ సహన భావముచూపు మానవత్వమే మానవజీవితమున జీవనార్థమైన దనియు, దానివిలువ ఆరోగ్యభాగ్యములకంటె నధికమైనదనియుఁ దెలియునగును. అధికసంపన్నులుగాని, అధికమేధావులుగాని, ఉన్నతపదస్థులుగాని నిజముగా గొప్పవారుగారు. వీరు దరిద్రు లనికాని, వారల్పబుద్ధులనికాని, దేవుఁడు కొందఱను దక్కువగాఁ జూఁడడు. ముఖ్యవిషయ మేమనఁగా, నితరులయెడ దయాంత రంగము చూపితిమా, మనలో మనము మోసములేని సత్య దృష్టిని గలిగియుంటిమా, యితరులతో మనకుఁగల సంబంధము నిర్దుష్టమైనదా యనునదే. ఆరోగ్యభాగ్యములు సమృద్ధిగాఁ గలవారు తాపత్రయదుఃఖములతోఁ గొట్టుకొనుచున్నారు. వారు మిత్రులయెదుట దరహాసముద్రిత వదనారవిందులై కన్పట్ట వచ్చునుగాని, వారి హృదయములుమాత్రము విషాదభగ్న ములైయున్నవి. బాహ్యవిషయ సంపాదనములపై దృష్టిని కేంద్రీ కరించి, తమ అధికారైశ్వర్యములను, నిజదుఃస్థితి పైకిఁ గనపడ కుండనుండునట్లు వినియోగించి కొన్నికోర్కెలను తీర్చు కొందురు. కాని లోలోపల తమకేదియో కొఱఁతగలదని యెఱుఁ గుదురు. ఎవ్వరును వారిని బట్టుకొనియుండరనియుఁ దమబిడ్డలే తమ కనుకూలముగా నుండుటలేదనియుఁ దామెన్నఁటికిని

మార్పులేని యొక కేంద్రమును స్థాపింపలేకున్నారమనియు, వార్ధక్యము వచ్చినకొలఁదియు నధికముగాఁ దా మొంటరుల మగుచుంటిమనియు, లోకము ప్రత్యేకముగాఁ దమయెడ దయా హీనమైనదనియు విలపించుచుందురు. త్వరలోనే వారు జీవితము వ్యర్థమైనదని గ్రహింతురు. కొన్నివేళల మనము పశువులనేత్రము లలో, దుర్భరదుఃఖ మనుభవించుచు, నిస్సహాయ విషాదమును మౌనపూర్వకమైన అద్భుతావహాభీతిని సూచింపఁబడుటను గమ నించియుందుము. అట్లే వారికంఠనాదము లెంతమధురముగా నున్నను, బాహ్యాడంబరము లెంతమహోల్లాసపూరితములుగా నున్నను, ఈప్రపంచము నిజముగా వారి నివాసముకాదనియు, నెచటనో చాలదూరదేశమునుండి వచ్చితిరిగి స్వస్థానమునకుఁ బోలేకయుంటిమనియు సూచించు ఖేదకలుషితమైన వారిచూపే ప్రకటించుచుండును. పేర్కొనుటకు వీలులేని విషాదము వారిని క్రుంగఁదీయును; తత్ఫలితముగా వారు సర్వవిషయములలో నుదాసీనచిత్తులగుదురు; కాని, చిత్తశాంతికలిగి, యీదేహమును వీడుటయే మేలని వారిలో నొకదుర్బలమైనవాంఛ పెంపొందును. ఎదుటి హృదయములో నేమున్నదో చూడఁగల చూపున్న వానికి, వారి నిరర్థకోల్లాసములు, కేళులు, విలాసదరహాసములు నిజస్థితిని మఱుగుపఱచుచున్నవని స్పష్టమగును. వారికి సౌఖ్యము లేదనుట, వారి చిత్తస్థైర్యలోపమే చూపును. వారిదుఃఖాను భూతికిఁ గారణమేమనఁగా, వా రసంగతము, నర్థశూన్యము నైన వానినుండి తొలఁగిపోవుటకును, అర్థవంతము, స్వతంత్రము,

సమంజసమున్నైన వానికి లోఁబడుట కిచ్ఛగింపకుండుటయునై యున్నవి. మోక్షమునకు మనమెంత దగ్గరగాఁ బోయినచో నంత నిస్సహాయతను మన మెదుర్కొందుము, అచట నొక ప్రక్క మోక్షాపేక్ష యుండఁగా, నింకొక ప్రక్క చేసిన పాప పుంజములు స్మృతికిఁ దగిలి, మనమేల వివేకవంతులమై ప్రవర్తింపలేదను బాధకలుగును. ఇట్టి దుర్భరవిషాదము సమస్యాపరిష్కారమును గోరు ననఁగాఁ,దమబిడ్డలను దల్లిదండ్రులు చేయూఁత నిచ్చినపుడారీతిఁగాఁ దమ్ము సక్రమమార్గమున నడుపు మిత్రుఁడుండెనాయని యన్వేషింతురు. ఎవరు విలపింతురో, కష్టముల, ననుభవింతురో,దుఃఖసాగరమున నీదులాడుదురో వారుధన్యులు, దుఃఖమెఱిగిన హృదయమే ప్రేమింపఁగలదు. గుండె కోమలమైన కొలఁదియు నధికబాధ నొందును. విశాలహృదయుల ఖేదము మిక్కిలి లోతైనదగుటచే వారు కంటతడిపెట్టఁజాలరు, దుఃఖమునుండి దూరముగానుండు నుపాయము జీవితము యొక్క అత్యుత్కృష్ట లాభమును త్యాగముచేయుటవలననే లభించును; అనఁగా హృదయమును ఖాయిచేయవలెను. స్వర్ణ కిరీటమును ధరించిన భక్తుని గాథలో మంచియుపదేశముకలదు. ఈభక్తుఁడు స్వర్గమునకుఁ బోయినప్పుడితరభక్తులందరచట మణిస్థగిత కాంచన కిరీటములను ధరించియుండుటయుఁ దాను మాత్రము మణులులేని వట్టికనకమయకిరీటమునే ధరించుటయుఁ గాంచి, యిట్లడిగెను;"నాకిరీటమున కేల మణులులేవు?"దానికి దేవత యిట్లుచెప్పెను; "నీవు వానికిఁ దగినయేర్పాటు చేసికొనలేదు. ఈభక్తుల కిరీటములలోని రత్నములు వారు భూలోకము

లోనుండఁగా విడిచిపెట్టిన కన్నీటిబిందువులు. నీవెన్నఁడు కన్నీరు విడువలేదు." "దేవుని ప్రేమించి నేనెంతో సుఖముగానుండఁగా నేనేల దుఃఖాశ్రువుల విడువవలెన"ని భక్తుఁడడిగెను. "ఇఁక నధిక ప్రసంగము చేయకుము. ఇది నీకిరీటము, వట్టిబంగారము తోడనే చేయఁబడెను; రత్నభూషణములు గలది దుఃఖాశ్రువుల విడిచిపెట్టిన వారికిమాత్రమే" యని దేవత బదులుచెప్పెను. దుఃఖమువలననే మనకు జ్ఞానోదయమగును. ఏకాకియై యేడ్చి, బాధ లనుభవించుటే నిజమైన జీవితలక్షణము. హృదయము యొక్క లోతు తెలియఁగని జనులు బాహ్యజీవితములను జీవించుచు, దుఃఖాగ్నియొక్క వేడిమి ననుభవింపరు. దుఃఖానుభవము తఱచుగా శిక్షగాదు శిక్షణమే. ఏదేని ఘోరవిపత్తు సంభవించినపుడు, మనమాక్షణములోఁ జకితులమై, పరాభూతులమై, విచేష్టితులమై, అతిదారుణాంధకార మావరింపఁగా, జీవిత మించుకేనియు రుచింపనపుడు, "హా! భగవంతుఁడా! నీవు మృతిపొందితివా?" యనియో లేక, యింకను బెద్దగొంతుకతో "హాదైవమా! నన్నేల విడిచిపుచ్చితివ"నియో యాక్రోశించినను మన దిక్కులేని విలాపమునకును సమాధానము సంప్రాప్తింపనపుడు, ఆ మ్రింగివేయు భయంకర శాంతివాతావరణములో జీవితముయొక్క పునాదులు కదిలిపోయి, ప్రపంచసౌధము మూలమట్టముగాఁ గూలిపోవ నుంకించున ట్లుండఁగా, నట్టి హైన్యమునంత ననుభవించి, తుపానునెదుర్కొని, ఆశాప్రేమ జ్యోతులను నమ్మి చరింపవలెను. ఇదంతయు దుఃఖము, దుఃఖానుభవమువలననే, మన కాత్మజ్ఞాన వికాసములు కలుగును.

యాతన సహించుటచేతనే, మనస్సు జడపదార్థమును జయించె నని, ఋజువుచేయుదుము; మఱియు దుఃఖానుభూతిచే మనలో నుచితజ్ఞత పెంపొందును. దుఃఖానుభూతిచే జీవితము సుశిక్షితమై దుఃఖోపద్రవమునుండి విముక్తికుపాయమును గాంచినపుడు, దైవకృపచే దుఃఖ మానందముగా మార్పునొందును. దుఃఖభీతి దుఃఖానుభూతికి వలయు ధైర్యముగా రూపొందును. మానవుఁడు తా నిచ్ఛాపూర్వకముగా ననుభవించు బాధనుండియే యానందమునకు రాజమార్గము కన్పట్టును.

మనలోఁ బ్రతియొక్కని జీవితము ననేకుల జీవితములఁ బెక్కుతావుల స్పృశించును. మనము బలారోగ్యములను, ధైర్యోల్లాసములను వారితో సంపర్కమువలనఁ గాంచుచున్నాము. మనముపోవు కొందరియొద్ద నుపశాంతి సాహాయ్యములకెన్నఁడును లోపము రాలేదు. అంధకారబంధురములైన జీవితమందిరములలో దీపారాధనచేయు మహనీయులు పృథ్వీమండల సారభూతులు. మిక్కిలితఱచుగా మనము వారిప్రేమను, మైత్రిని మనవిగా భావింతుము. వారికి మనమెంత ఋణపడియుంటిమో మనము గుర్తింపము; దయాదాక్షిణ్యములకు, కృతజ్ఞతకును ఋణముతీర్చుట సాధ్యమైనపనికాదు. అది ప్రతిఫలాపేక్ష లేనిది. పరిశుద్ధ ప్రేమయున్నచోట, మానవుఁ డిచ్చునేకాని అమ్మఁడు; పవిత్రబహుమానము సంగీకరించునేకాని, కోరిసంపాదింపఁడు. ఆత్మజ్ఞాన విపణివీథిలోఁ, బ్రేమ న్యాయ్యముకంటె నధికమైనది. న్యాయ్యము, గుడ్డిదైన దేవతమాత్రమే. అందు లేశమాత్ర గుణమున్నదని ప్రేమించిన

న్యక్తి తలంచుచోఁ, బ్రియుఁడు తనసర్వస్వమర్పించి, అపార్థ దూషణ తిరస్కారములకేగాక, దుస్సహానిందకును, దారుణ ప్రపీడనముఁకును సర్వదా సంసిద్ధుఁడగును. ఎంతశ్రద్ధయైనను, త్యాగమైనను జూపును. అంతరాత్మ మారణించి, లోకమంతయు నొక గహనమై, హృదయము లెండి బీటలుదీసి, బుద్ధులు నిస్సారములైన సమయమున, మనకాశోపశాంతుల నిచ్చునవి. వస్తువిభాగశక్తియు, విమర్శయుఁగావు. మైత్రియుఁ బ్రేమయే, ఇవియే మానవులకు నూతనశ్రేణి జీవితములఁజేకూర్చును. అవి, ధనముకంటెను, గీర్తికంటెను, విజ్ఞానముకంటెను గొప్పవి. అత్యంత దరిద్రులు వీనిని బడయవచ్చును; మహీమండలాధి పతులు నీవిషయములో నధికులుగారు. అవి పదవులపైఁగాని, ధనముపైఁగాని యాధారపడియుండలేదు. వానికిఁ గాలుసేతు లవసరములుకావు. అవి మానవుల నేత్రములలోఁ బ్రకాశించి, ఒకమాటచేఁ గాని చిఱునగవుచేఁగాని అనురాగమును బ్రదర్శించును. గాఢాంధకారములో విద్యుత్తరంగమువలెఁ, గృపార్ద్రమైన కరస్పర్శ మానవు నుత్తేజితునొనర్చును, ప్రతిభావంతులు, మితమైన సంభాషణవలననో, మృదువైన సంజ్ఞవలననో, బ్రహ్మాండమైన ప్రభావముల నుదయింపఁజేసి హృదయ పరివర్తనముల గలుగఁజేయుదురు. మానవహృదయములలో గుప్తమై, అణఁగియున్న మానవత్వము, ఆదర్శము పైకుబికి గట్లుతెగి ప్రవహించును.

శాస్త్రములొప్పఁజెప్పఁగల పండితునికంటెను, ఆవేశము లేని విజ్ఞానప్రచారకునికంటెను, మానవత్వసిద్ధినొందిన యిట్టి

వ్యక్తిగత జీవితసంపర్కమే నాదృష్టిలో నుత్కృష్టమైనది. దుష్ప్లులని, దీనునిపక్షమున నిలుచు సహజప్రకృతి, ఉన్నత సంస్కారముగలవాని ముఖ్యలక్షణము. ఏ మానవుఁడు నింకొకని నెఱుఁగఁడు. తా నెఱుఁగని వానిని, తెలియనివానినిగూర్చి మానవుఁడెట్లు నిశ్చయభావమును వ్యక్తీకరింపఁగలఁడు? మన మన్యుల మాటలువిని చేతలు చూతుము. వారిభావములను, హృదయములలోని తత్త్వములను మనమెఱుఁగము. మానవుల అంతరాత్మలోని రహస్యప్రదేశములనుగాని, వారిహృదయము లను గాల్చుచున్న అవ్యక్త కామములనుగాని మనము గ్రహింప ఁజాలము. ఇంకొకవ్యక్తియొక్క అనుభవమును మనము ననుభవించినఁగాని దానిస్వరూపమేమో తెలియదు. అదియుఁ గాక, యింకొకని జీవితమునుగూర్చి తీర్పులుచెప్పుటకు మనలో నెవరి హృదయములంతగాఁ బవిత్రములైనవి? ఎవరి శీలము లంతగా నిష్కళంకములైనవి? ప్రతివ్యక్తి నాధ్యాత్మికముగాఁ జీల్చి పరిశీలించు నుపాయమున్నచో దండనార్హులుగాని వారెవ్వరును మిగులరు. ఏదే నొక దుర్దమకామోద్రేకవశు లమై, వివేకము గోల్పోయినపుడు మనమందరమును తలయెత్త లేని పరాభవపరిస్థితిలో నుందుము మనమందర మటవీపక్షి జాలమువలె, పంజరములో బంధింపఁబడి, బయటపడు నుద్దేశ ముతో మనఱెక్కలతోఁ బంజరపుటూచలను బెట్టి కొట్టుకొను చున్నాము. తీర్పుచెప్పుట మిక్కిలికఠినముగ గర్హింపఁదగినది. వ్యభిచారదోషమునఁబట్టుపడిన నారీమణినిజూచి యామెనుగాదు జీసస్ ఖండించినది; ఆమెను నిరసింపఁబూనిన జనులనే

యాతఁడు నిరసించెను. అజ్ఞానదూషితురాలైన యాదీనురాలి యెడ వారు ప్రదర్శించిన వారి మానసిక నైచ్యమును, వారి చిత్తగత పశులక్షణమును, వారిహృదయ క్షుద్రత్వమునుజూచి జీసస్ మిక్కిలి ఖిన్నుఁడయ్యెను. అట్టి విషభావ క్రౌర్యమయము ద్వేషసంకులమునైన విమర్శగలచోట, జీసస్‌చూపిన ప్రేమ యొక్కటే నిజమైనది. సత్పురుషు లెవ్వరినిగూర్చి నిరసనభావ మునుగాని, తామెవ్వరికంటె నధికులమనిగాని తలఁచుటకైన నిష్టపడరు. ప్రతివ్యక్తియు, దనహృదయగర్భమునఁ, దాను నితరులవంటివాఁడేయనియు, వారివలెనే తనకును మానవసహజమైన వ్యర్థభావములుగలవనియు నెఱుఁగును. మోహావిష్టుల మైనప్పుడు మనమందరమును నేరస్థులమే; ఆవేశముగలిగినపు డందరమును వీరులమే, 'అజ్ఞానముచేతను, సందర్భముల ననుస రించియు మనము భిన్నవిచిత్రరూపముల ధరింతుము. తమ్మా వేశించు జంతువాంఛలనుండి విడివడు శక్తి మానవులందరకును లేదు; కాని సర్వజంతువులలో మానవుఁడొక్కఁడే, ప్రకృతి వ్యామోహ పాశములనుండి విముక్తుఁడగు నాత్మజ్ఞాన సంపాద నమునకు సమర్థుఁడు. కామమోహములకు మనలో నత్యధిక సంఖ్యాకులము దాసులము. కామవశులమైనప్పుడు, వస్తువులను మనము సహజస్వరూపములో దర్శింపఁజాలము. మనభావ ముల కనుగుణముగానున్న వానినే మనము నమ్ముదుము, కాబట్టి, మంచినే స్వీకరించి చెడుగును విడిచిపెట్టుట యోగ్యుఁ డగు ప్రతిమానవునికిని విధియైయున్నది. ఘోరదుర్జనుని యందైనను, అప్పరాని దైవత్వ మను నగ్నిలోని నెరసొకటి

యున్నది, నిత్యత్వ రహస్యము లందరలోనున్నవి కాని కొందరిలోమాత్రమే యవి బహిర్ముఖములగును.

నేను కోపగించుట కసమర్థుఁడననియు, మూర్ఖులు నన్నుఁ జలింపఁజేయఁజాలరనియు, నేను మూర్ఖులను సహించుటయే కాక, పాపులనుగూడ సహింతుననియు, నిరువదేండ్లనుండి నన్ను బాగుగా నెఱిఁగిన యొకమిత్రుఁడు పరిహాసప్రాయముగాఁ బలికినాఁడు. ఈమిత్రునివిమర్శ అసత్యమని చెప్పఁజాలను. యోగ్యులకు, నయోగ్యులకుఁగల భేదమును దెలిసికొనుట సులభము కాదు. మానసికముగా భావములను మంచివనియుఁ జెడ్డవనియు విభాగింపవచ్చును; గాని మనుష్యులనట్లు చేయఁజాలము; ఏలన మనలోఁ బ్రతివ్యక్తియందును భిన్నపరిమాణములలో మంచియుఁ జెడ్డయు, ఉత్కృష్టతయు నికృష్టతయు, సత్యాసత్యములును గలిసియున్నవి. మఱియు న్యాయాన్యాయ్యములఁగూర్చి సంఘమునకు విచిత్రభావములు గలవు. సంప్రదాయవిరుద్ధములగు వ్యక్తిగత సంబంధములు తప్పు; దేశములమధ్యమున యుద్ధకారణములగు పనులుమాత్రమొప్పు! క్రూరత్వము, మోసము, పరపీడనము క్షంతవ్యములు; అనర్హుఁడగువానిని వానికిఁదగినరీతిని గొలిచి ప్రేమింపక, మిక్కిలి అధికముగాఁబ్రేమించుట గర్హింపఁబడును; కాని యిట్లు ప్రేమించుట దురదృష్టమే కావచ్చును గాని, నేరమగునా? ప్రతివిషయములో దోసఁగులు వెదకు కువిమర్శకులను, దంభాచారపరాయణులనుకంటె స్వైరవిహారులనే మిక్కిలి సులభముగా భక్తులను జేయవచ్చును. జీవితములోఁగల అనంతమైన దైన్య

స్థితి, అనంతమైన సుహృదయ ప్రకటనమును గోరును. పాప పరతంత్రులు వలయునది దూషణము, గర్హణము కాదు, వారు వారియెడఁగోరునది మన సుహృదయము; వారొకింత సుఖలాలసులు; ఒకింత మర్యాదను విశ్రాంతిని గోరుదురు, లోకనింద వలనను, తాముచేసిన దుష్కార్యభారముచే నరములశక్తి శూన్యస్థితికిఁ బోవుచుండఁగా దిగ్భ్రమలోమగ్నులై విలపించువారు, తాము సంపూర్ణముగా విశ్వాసముంచఁగలయొక సుహృదయుని మాత్రమే కోరుదురు. మానవానురాగము వారికత్యంత ప్రధానమైనది. దయచూపుటనఁగా నొకవిధమగు నిరసనభావమున్నది; అందుచే గతమును విస్మరించి, అనాగతమునకు సాయపడు నొకవిధమగు మృదువైన అనురాగము కావలసియున్నది. తుదివఱకు వినాశమార్గమునే పట్టనలయు నవసరములేదు. మానసికాధ్యాత్మిక తత్త్వమునుమార్చి, విలయమార్గము నరికట్టి, యింకొక నూతనలక్ష్యమును సాధింపవచ్చును. స్వైరవిహారివలెఁ బర్వతాగ్రమునుండి అగాధములో బడి నశించుటో, లేక పుణ్యక్షేత్రముల దర్శించు యాత్రికునివలె నుత్తరోత్తరోన్నతినందుటయో యనునది మనపై నాధారపడియున్నది. ప్రేమచే మంచిదారిఁద్రొక్కుటకు మార్పుకలుగజేయఁగలమని నాదృఢవిశ్వాసము. కువిమర్శకుని స్థానమును మిత్రుఁ డాక్రమించి, మనలోని నిరర్థకవాంఛలను, దుష్కామములను మనదృష్టియెదుటకు దెచ్చి, నిర్మూలించుటలో కృతార్థుఁడగును. తాముచెప్పునదేమియును లేనికారణమునఁగొందరు మౌనము వహింతురు. తాముచెప్పుకొనుట కెవ్వరును లేని

కారణమునఁ గొందరు మానము వహింతురు. నిక్కమైన మిత్రునితో నెంత భ్రష్టమతులైనను దమహృదయభారములను వెడలఁగ్రక్కి యుపశాంతి నొందుదురు. నిజమగు నాప్తుఁడు మానవుని నైచ్యమెంత జుగుప్సాకరమైనదైనను, దానిని స్వస్వరూపములో దర్శించుటకు వెనుదీయఁడు, ఏలన, మానవునిలోఁగల యాత్మస్వరూపము సహజముగాఁ బ్రియమైనది. ఏమానవుఁడుగాని సహజముగాఁ గిరాతకుఁడుగాఁడు; సంస్కారమున కనర్హుఁడునుగాఁడు. ఎవ్వఁడుగాని, మానవాత్మ నణచివేయుటకుఁగాని, మత్తుమందు పెట్టుటకుఁగాని, మోసగించుటకుఁగాని చిరకాలము సాధ్యపడదు. మానవవ్యక్తిలో నుత్తమభాగమాతనిలోని నిజమైనభాగమే; అదియే ఆతని ఆత్మస్వరూపము. జీవితమన్నచో నిట్టిదృష్టిగల మానవుఁడు మానవుల మాంద్య దౌర్బల్యముల నంతగా గణింపఁడు. పాల్ భక్తుఁడిట్లనెను; "ఇతరులు తప్పుచేయుటచేఁ బ్రేమయెన్నఁడును సంతసింపదు; ప్రేమ, యోగ్యతనుజూచియే సంతసించును; పరులదోసఁగుల నెంచదు; ఉత్తమమైనదానినే నమ్ముట కుత్సహించును; ఎల్లప్పుడు ధైర్యముతో సహించుచుండును."

మనకెవ్వరు ప్రియులో వారిచేఁతలను విమర్శింపఁబూనుట కష్టతమమైనకార్యములలో నొకటి. కాని యట్టిమిత్రుల విమర్శనమునే మనముకోరి, సంపాదింపఁదగినది. ఇట్టి ధైర్యముకలిగిన కొలఁదియు నట్టి యాప్తునితో ననుబంధము దృఢతరమగుచుండును. నిజమగు నాప్తుఁడు మనలఁగూర్చి తెలిసి, యోగక్షేమ పరిశీలనము చేయఁగోరుటేకాక, మనలోతుపాతులనుగ్రుచ్చి,

చూచి, హృదయములో మూలమూలల వెదకి పరీక్షింపఁ జూచును. ఇట్టి క్రూరము, నిర్దయాత్మకమునైన మనలోని లోపముల నీవలికీడ్చుట, మనకు దుర్భరమైన బాధనేగాక పరాభవమును గలిగించును. కాని చిత్తశాంతియు నాంతరంగిక సమతయుఁ గాంచుట కొక్కటేమార్గము కలదు: జ్ఞానమును సంపాదించుకొనుటయు దానిననుసరించి బుద్ధిమార్చుకొనుటయు నా పద్ధతి. మనము మనలనే మోసగించు పద్ధతిని విడిచి, పరిస్థితుల కనుగుణముగా హృదయపరివర్తనము చేసికొనవలెను. మనకే మన మసత్యమును జెప్పుకొనరాదు. మనము పరిపూర్ణముగాఁ బ్రేమించువఱకును మనము పరిపూర్ణముగా నెఱుఁగఁజాల మనుట నిజమైనచో, మనము పరిపూర్ణముగాఁ దెలియువఱకును బరిపూర్ణముగాఁ బ్రేమింపఁజాల మనుటయు నిజమే. అవమానభీతిచే మనము సాహసించుటలేదు. మనము మనయందలి దారుణమైన అనౌచిత్యమును బయల్పఱచుచుంటి మనియు మనలను మనమే పీడినిబెట్టుకొనుచుంటిమనియు, మనకుమనమే అవమానమును జేసికొనుచుంటిమనియుఁ దలఁతుము. కాని నిజమగుప్రేమలో నట్టిభావముల కవసరము లేదు; కాని కృత్రిమ ప్రేమ కిది యంతయు విచిత్రముగాను, అపూర్వముగాను కఠినముగాను దోఁచవచ్చును. సిగ్గుపడుటకుఁగాని, దాచిపుచ్చుటకుఁగాని యిందవకాశ మేమియునులేదు. ఈభావ మున్నంత కాలము మానవుఁడు శాంతచిత్తుఁడు కాఁజాలఁడు, ఒకమిత్రుని భావము విమర్శాత్మకముగాని వ్యతిరేకముకాని కాఁజాలదు. వేనివలన మనము బాధపడుచుంటిమో వానినిఁగూర్చి పైకిఁ

జెప్పుకొనుటవలన వానిబాధించుశక్తి సడలును. మనము సత్యము నెఱుఁగనంతకాలము బాహ్యవిషయబద్ధులమై శూన్యాంతరంగులమగుదుము. మనకు మనపైఁగల మమకారమును వ్యామోహమును విడిచిపెట్టి యథార్థపరిస్థితిని బట్టబయటఁ బ్రదర్శించుట దుస్సహ ఖేదకారణమును, మహనీయత్యాగమునై యున్నది కాని దానికిఁ దగినవిలువగలదు. మహాభారతము ననుసరించి, సత్యమనగా నుత్కృష్టశ్రేణికిఁ జెందిన తపోత్యాగములని చెప్పఁబడెను; మఱియు నిట్లుచెప్పెను; "సత్పురుషులకు సత్యము సహజమైనది. సత్యము శాశ్వతధర్మము, అత్యంతాదరబుద్ధితో నందరును సత్యమునకు మోకరిల్లవలెను. సత్యమే పరమగతి, సత్యమే ధర్మము, సత్యమే తపస్సు, సత్యమేయోగము, సత్యమే శాశ్వతబ్రహ్మస్వరూపము. సత్యము శ్రేష్ఠతమమైన యజ్ఞము, సత్యమే సర్వమున కాధారము." అసత్యమును, మోసమును గావు; సత్యమును ఋజుత్వమును శాశ్వతమైత్రికిని, ఆత్మసాధనమునకును మూలాధారములు. పాపియైనవాఁడు తానెట్టి యున్నతిస్థితికివచ్చెనో వ్యాఖ్యానించు నిమిత్తము, దాను జేసిన పాపపంక మెంతటిలోతుగలదో దంభోల్లాసముతో వర్ణించు ఆధ్యాత్మికనగ్నత్వ ప్రదర్శనములవంటివి మాత్రము, మనము పైనిఁ బేర్కొనిన మిత్రునితోఁ జెప్పుకొను మనశీలములలోని దోసఁగులనుగూర్చిన ప్రకటనములు గావు.

ఎవరిసంఖ్య లోకములో సమృద్ధిగానున్నదో, అట్టి దిక్కులేని దురదృష్టవంతులు, సుఖహీనులు నైనవారిలో నేకొలఁదిమందియొక్కయో విశ్వాసమును మనముపొందఁగలుగు

నదృష్టము మనలోఁ జాలతక్కువమందికే పట్టును. ఎవరిని సంఘము బహిష్కరించెనో, ఎవరిహృదయ విపంచీతంత్రులు తాపత్రయ మహావాయువులచే భగ్నములైనవో, వారే జయ ప్రదములైన జీవితములుగల వారికంటె నధికముగా మనల నాక ర్షింతురు; ఏలన వారిలో మనకు జీవితముయొక్క రహస్యము, సౌందర్యము, విషాదము ప్రత్యక్షములగును. అనాథులయందును పతితులయందును ప్రత్యేకమైన గుణవిశేషమేమియు లేదుగాని విధితోడనో లేక పరిస్థితులతోడనో అజేయమైన మానవుని లోని ఆత్మశక్తిసలుపు పోరాటముమాత్రము వారిలో మనము దర్శింపఁగలము. ఎంతవంచినను, ఎంతకొట్టినను, ఆత్మశక్తి యెన్నఁడును భగ్నముకాదు, విశ్వాసమనఁగా నేమో, అది యెచటనుండి యనగా బుద్ధినుండి లేక హృదయమునుండి వచ్చునో, యితరులతో నేమార్గముల ద్వారమున సంపర్కము పెట్టుకొనునో, మనమెఱుఁగము. అది నేత్రములలోఁ గన్పట్టునో లేక పలికిన పలుకులలో వినఁబడునో మనకుఁదెలియదు. అది విశేష విద్యాభ్యాసముచేఁగాని, విజ్ఞానముచేఁగాని లభించునది కాదు. ఇదియొక ఐంద్రజాలికవరము; కొందరికిఁ బ్రసాదింపఁ బడి, కొందరికి దుర్లభమైనది. ఈ యమూల్యమైన లక్షణ ములో లేశమాత్రము నాకుఁ బ్రసాదింపఁబడెనని నేను వెంటనే గ్రహించితిని. ఇందు నాఘనత యేమియును లేదు. వేదాంతమును గూర్చి ప్రసంగించు హిందువులు, ఆత్మప్రపంచములో నధిక పరిచయముగలవారని ప్రజలలో నొక మూఢవిశ్వాసముగలదు. ఆ కారణముచే నూహించుటకు సాధ్యములైన సర్వవిధ క్లిష్టపరి

స్థితులలోను అభిప్రాయ సాహాయ్యముల నభిలషించుచు నాకుఁ బెక్కులేఖలు వచ్చినవి. ఇందుఁ గొన్ని అర్థరహితములు, కొన్ని కారుణ్యపాత్రములు, కొన్ని రెండులక్షణములునుగలవై యున్నవి. ఈ లేఖా రచయితలలోఁ దమ దుర్దశలనుండి బయ ల్పడుటకుఁ దమకుఁదోఁచిన పరిష్కారమార్గములనే విశ్వసిం చుచు సలహానిమిత్త మూరక వ్రాసిన మూర్ఖచిత్తులు, దంభ ప్రవృత్తులు పెక్కుమందిగలరు. కాని యప్పుడప్పుడు, దీర్ఘము లైన లేఖలు రచించిన చిరమిత్రులు తమలేఖలవలన సన్నిహితు లైనవారు, అదివఱ కేసంబంధమును లేని అపరచితవ్యక్తులు తమ దుఃఖములనుగూర్చియో, మిత్రుల దుఃఖస్థితినిగూర్చియో వ్రాయుచుండిరి. వయోవర్గ పదవీ విద్యాభేదములతో నిమి త్తము లేనిదే నామిత్రమండలి దిక్కులేనట్టియు, దుర్దశోపహతు లైనట్టియుఁ గొందరకుఁ గొంతయనురాగమును, గొంత సుహృ దయమును జూపిన వ్యక్తులలో మొదటివాఁడనుగాని, లేక యేకైకవ్యక్తినిగాని నేనేఅయియుంటినని తెలిసికొని సంతసించి తిని. కొన్నిసమయములలోఁ గొంతమందియెడ నాకుఁగలిగిన అమితానురాగము దురభిప్రాయహేతువైనది. కొందఱివిషయ ములో నేనుజేసిన ఉత్తమప్రయత్నములన్నియు నిష్ఫలములై నవి. అనఁగా వీరివిషయమై గల సమస్యలను నేను సముచిత మైన వివేకముతోఁగాని, సామర్థ్యముతోఁగాని పరిష్కరింపఁ జాలనైతినని స్పష్టము.

ఏది యెట్లైనను, పెక్కుమంది నాసోదర మానవకోటితో సన్నిహితమైన సుహృదయ సంపర్కము నాకు లభించినందులకు

మిక్కిలి యానందించితిని. ఏదిగాని నిష్కారణముగాఁ దటస్థించు ననికాని, కాకతాళన్యాయముగా సంభవించుననికాని నేను నమ్మను. కోరికలు ప్రకృతిశక్తుల ద్వారమున మన కగపడకుండఁ గనే పనిచేయును. మిక్కిలి అప్రధానములుగా గోచరించిన తాటస్థ్యములే మనజీవితములలో నపూర్వ పరివర్తనములకుఁ గారణములగును. ఆధ్యాత్మిక భూమ్యాకర్షణశక్తి యొకటికలదు. ఏల కొందరు మనలనాకర్షింతురో మన మెన్నఁడును బూర్తిగాఁ జెప్పఁజాలము. వారియందు మన కభిరుచికలిగి, వారి ననుసరింప కుండ నుండఁజాలము. సౌందర్యము తన్నుఁదా నెప్పుడును గ్రహింపఁజాలదని గోథే చెప్పియున్నాఁడు. ఆకర్షణహేతువు కూడఁ గొంతయే మనకుఁ దెలియును. కొందరు వ్యక్తు లేలఁ గొందరతో సంపర్కము గలిగియుందురో చెప్పఁజాలము. మన యిష్టానిష్టములకు నిజమైనకారణములు, మన స్వభావము యొక్క రహస్యస్థలములలో దాగియున్నవి, వానికిఁ దర్కముతోఁగాని హేతువుతోఁగాని యెట్టిసంబంధమును లేదు. నాకీ జీవితములో ననుగ్రహింపఁబడిన యనుభవము లద్భుతములై నవి. వానిద్వారముననే, నాస్వభావములోని రహస్యభాగము లన్నియు నా కద్భుతరీతిని వ్యక్తమైనవి. వానిమూలముననే, అధికక్లిష్టము, కష్టతరము నైనను, నధికసమృద్ధి సంపూర్ణతలతోఁ గూడిన సాంఘికజీవితముతో నాజీవితమునకు సన్నిహితసంపర్క మేర్పడినది. అవియే నాకు మానవసంబంధ బాంధవ్యములను గల్పించినవి; ఉన్నతానందములను, గాఢవిషాదములను గలుగఁజేసి నవి; అవి నాజీవితమను వస్త్రనిర్మాణములోఁ బడుగుపేకలైపోయి నవి. ఒకరీతిగా నవి నా భవిష్యద్దశా వ్యాప్తిహేతుభూతములైనవి.

విషాద కష్టములు నాకును గలిగినవి; కాని, నా యర్హతకుమించిన ఆనందవరప్రసాదములును నాకు లభించెను; అందు ముఖ్యమైనవి, ప్రజలు నాకుఁజూపి సమృద్ధికరములైన దయానురాగములు. వీనినిమిత్తము నేను కృతజ్ఞత చూపవలసినది మిగిలియున్నది. బుద్ధుఁడు క్రీస్తు మొదలు సామాన్యమానవులవఱకు నిజమైన ఆత్మజ్ఞాన దృష్టిగలవారి మానసికహృదయస్వభావములలో నెట్టిఘోరదోషములున్నను, మానవజాతికిఁ గల దుఃఖభారమును తగ్గించుటకొఱకును, ఏవి లేకున్నచో, జీవితయాత్ర కష్టమై, అందుచే మానవకోటి మార్గమధ్యమునఁ గ్రుంగి కూలిపోయియుండెడిదో అట్టి ఆశాప్రోత్సాహముల బలవత్తరము లొనర్చుట కొఱకును వారు కృషిచేసియుండిరి. ఏకొలఁదిగానైనను మనము వారిమార్గమునే యనుసరింపఁ దలఁచితిమేని, దీనులకు సాయపడి, మనము దుఃఖితుల కుపశాంతి నీయవలెను. దరిద్రులతోడను, దీనులతోడను, అల్పులతోడను; ఆర్తులతోడను నిండియున్న ప్రపంచముయొక్క ఖేదభారము నెక్కువగా మనము భరింపలేకపోవుచున్నాము; ఏలన మన జ్ఞానదృష్టి స్వార్థపరతంత్రమై యున్నది. ఏడ్చుచున్న చంటిబిడ్డకొక చిఱునవ్వు నొసఁగి, దుఃఖపంకమగ్నమై యున్న వేఱొకని నోదార్చి, ఆశాప్రోత్సాహముల నిచ్చి, నవ్యమార్గమును బట్టునట్లు చేయఁగలమేని మనము జీవితమంతయు మౌనమును ధరింపవలసి వచ్చినను నష్టములేదు.౧.

౧. శ్లో॥ నత్వహం కామయే రాజ్యం నస్వర్గమ్ నపునర్భవమ్,
కామయే దుఃఖతప్తానామ్ ప్రాణినామ్ ఆర్తినాశనమ్.
భాగవతము 9 అ. 21, 12.

# టోక్కియో ఉపన్యాసము

మిత్రులారా,

ఈదశమ ప్రపంచ మత సమాజముయొక్క అంతర్జాతీయ మహాసభకు ప్రారంభకునిగా నన్నాహ్వానించిన కార్యకర్తలకు నేను కృతజ్ఞుఁడను. గత సంవత్సరములలోఁ గొన్ని యీసమాజ సమావేశములందు నేను పాల్గొనియుంటిని. ఈప్రపంచ మత సమాజమునుగూర్చి, శ్రీ శాస్త్రిగారు నేడు మనకుఁ దెలియపఱచియుండుటచే దానిచరిత్రను గూర్చి నే నేమియు నిపుడు మఱలఁ బ్రసంగింప నవసరములేదు. మనము మనతరమువారు అణువును భేదించి, హైడ్రజిన్ బాంబును జేసినవారని చరిత్రమున లిఖింపఁబడుటకు మనమిచ్చగింపము. దూరస్థములైన దేశముల నేకప్రపంచ సమాజముగా మన తరమువారు మార్చినారని చరిత్రలో రచింపఁబడుటను మనము కోరవలసియున్నది. ఇదియే మనకందరకును గల కాంక్ష. జాతులన్నియు నొండొరుల ద్వారములయొద్దకు వచ్చియున్నవి; మనమందర మొక కుటుంబముగా జీవింప నేర్వకున్నచో మనభావిదశ, నిరాశాపూరితమని చెప్పవచ్చును.

ప్రకృతిశాస్త్ర యంత్రనిర్మాణ విజ్ఞానాభివృద్ధివలనఁ బ్రపంచమంతయు నొక్కజాతిగాఁ దెలియవచ్చినది. దానికి మానసికమైన యేకత్వమును, ఆధ్యాత్మికమైన సంయోగమును ముఖ్యావసరములైయున్నవి. ప్రపంచజాతులన్నిటి నేకముఖము

నకుఁ దెచ్చుటక నేకసంస్థలు పనిచేయుచున్నవి. ఐక్యరాజ్యసమితి, అందలి విద్యాసాంఘికార్థికశాఖ మున్నగునవి వున్నవి. ఏల ఐక్యమతసమితి యొకటుండరాదని మనమడుగవచ్చును. అందలి మతములన్నియు విశ్వసోదరత్వమునందును, లోకశాంతియందును విశ్వాసమును బ్రకటించి, మానవుని, తన మానవత్వదశనుండి, దైవత్వస్థితికిఁ దోడ్కొనిపోవుటలో సాయపడవచ్చును. మన మన్యోన్యము సహకరింపవలసివచ్చినపుడు మనకుఁ గొన్ని యిబ్బందులు గోచరించును. ఈప్రపంచ మతసమాజ కార్యక్రమములోఁ బనిచేయుచున్న దేశములలో భారతదేశమధికముగాఁ బాల్గొనుచున్నదని విని మిక్కిలి సంతసించుచున్నాను. ఈసమాజమును నడపుచున్నవారిలోఁ బెక్కునామములు భారతీయులనైయుండుట గన్పట్టుచున్నది. దానికిఁగారణము విశ్వమత సమాజభావము భారతీయమానసిక వాతావరణమున కనుగుణమైనదగుటయే.

మనము సకలమతసహకార సమాజమని నామకరణము చేసినపుడు సర్వమతముల వ్యక్తిత్వమును మనము కాపాడుటకు యత్నింతుమనియే భావము. అనగా మనమెట్టి కలగూరగంప మతమును ప్రోత్సహించుటలేదు. మతములన్నియుఁ గలిసిపోయి, యొకమిశ్రమమతము తలయెత్తవలెనని మనకోరిక కాదు. సకలమతములను తమప్రత్యేకలక్షణములను గాపాడుకొమ్మనియే చెప్పుదుము; కాని, ఒండొరుల నర్థముచేసికొని, తనకంటె నితరమతములలో నెట్టివిలువగలదో, యెట్టి మనోహర విషయములు, సముచితభావములున్నవో తెలియునిమిత్తము,

పరస్పరము కలిసికొని, యానందింపుడవి చెప్పుచున్నాము. ఏకప్రమాణమును సాధించుటకాని, భిన్నతలేని యొకేమతస్వరూపమును నిర్మించుటకాని, మనయాశయముకాదు, ఇతరమతముల నెఱింగి యర్థముచేసికొని పరస్పర సహకారమునకిచ్చగించు వ్యక్తులకు సోదరభావమును సాధించుటే మన మహదాశయమైయున్నది.

భారతదేశ చరిత్రారంభకాలమునుండియు, మతమనఁగా నాత్మజ్ఞానసిద్ధియు సర్వప్రాణికోటిని ప్రేమించుటయు ననుభావము వ్యాప్తిలోనుండెను. మహేంజోదారో నాగరికతనుజూపు చిహ్నములలో నొక శివవిగ్రహముగలదు. లోఁజూపుగలిగి సమాధిగతమై, సర్వకామములను జయింపఁబూని, సర్వభూతమైత్రితో ధ్యానించు దివ్యమూర్తియది, అనఁగా, లోపల పూర్ణజ్ఞానము, వెలుపల భూతదయ, యీరెండును మతజీవితరూపద్వయము, ఆశివునిమూర్తి, భారతదేశ తత్త్వావాతావరణమున కనుగుణమైనది. అట్టి మూర్తిలక్షణములే, బుద్ధునియందును, ఉపనిషన్మహర్షులందును, మహావీరునందును, జ్ఞానులయందును నట్టి యాదర్శములకొఱకే కృషి చేయుచున్న నేటి స్వాములయందును భక్తులయందునుగూడ గోచరించుచున్నవి. ఆధ్యాత్మికానుభవమనఁగా మానవత్వమునుండి దైవత్వమునందుటకుఁజేయు సాధనమైనచో నదియే మతలక్ష్యమైనచో, సాంఘికమతవిముక్తికై యెట్టిమార్పులేని ప్రత్యేకమార్గములను భారతీయులు బలవంతముగా శాసించియుండలేదు. జలములో సంచరించు మత్స్యముల కెన్ని బాటలు

గలవో, ఆకసమున విహరించు పక్షులకెన్ని దారులున్నవో, అన్నిమార్గములు పరమాత్మను జేరుటకుఁ గలవని ఉపనిషత్తులు చెప్పుచున్నవి.

దేవునిఁజేరుటకై యత్నించు ఆత్మాన్వేషకుని మార్గమిట్టిదని నిర్వచింపసాధ్యముగానిది. మానవునందుఁగల ఆత్మ అనంతమైనదైనచో, పరమాత్మనుగూర్చిన ఆత్మయొక్క ప్రవృత్తి విధానముగూడ ననంతమైనదేగావలెను. కావుననే, ఆత్మజ్ఞాన సిద్ధికి, నిశ్చితపదములు, రాజమార్గములును లేవు.

ఇతరమతములను గౌరవించి, వానియందలి గుణములను మన్నించుమార్గము, దేశమునకుఁ గొన్ని యిక్కట్టులను దెచ్చి పెట్టినమాట నిజమే, కాని, దేశమీమార్గమును విడిచిపెట్ట లేదు. నేటి భారతదేశ రాజ్యాంగ నిర్మాణసూత్రము లౌకికమని చెప్పుటలో, నీవు జడపదార్థమును, భౌతికసుఖములను నారాధింపవలెనని దానియభిప్రాయముకాదు; దానిభావమేమనఁగాఁ బ్రజానుష్ఠానములోనున్న సకలమతములను గౌరవించునట్టి స్వశాఖాస్వమత దురభిమానములులేని స్వచ్ఛమతాసక్తి ముఖ్యమైనదనియే. అన్యమతస్థుల మతాభిమానములను నిరసింపని విశాలభావమును గలిగియుండు నాధ్యాత్మిక సత్ప్రవర్తనమే మనకు వలయునది. భారతదేశము లౌకికరాజ్యమనుటలోని తాత్పర్యమిదియే.

జపానీయుల జీవితవిజ్ఞానములపై నఖండప్రభావము జూపిన బుద్ధభగవానునుపదేశమట్టి సిద్ధాంతమున కనుగుణమై యున్నదని చెప్పవచ్చును. బుద్ధుఁడు ద్వేషించునది సిద్ధాంత

సంబంధమైన వివాదము. నిరూపించుట కవకాశము లేని పరమార్థమునుగూర్చిన కేవల సిద్ధాంతములలోని వ్యత్యాసముల నెత్తుకొని తానుజీవించిన కాలమునందలి ప్రజలు, తుదిలేని వివాదములతోఁ దమజీవితములను వ్యర్థముచేయుచుండుట నాతఁడు గాంచినాఁడు. ఈక్రియాశూన్య వివాదములు, నిజమైన మతాభిమానులకుఁ గలఁతపుట్టించి, విసుగును, జుగుప్సను గలుగఁ జేసినవి. అందుచే బుద్ధుఁడు చెప్పినాఁడు; "ఏప్రామాణ్యమును గుడ్డిగా నంగీకరింపకుఁడు." అతని మహావాక్యములలో నొకటి యిట్లు చెప్పుచున్నది: "పరీక్ష్య గృహ్యామ్మద్వాచో, నతు గౌరవాత్." అనగా "నేను జెప్పినదానిని నాయందు గౌరవముచే నంగీకరింపకుఁడు, దానిని మీహేతుసామర్థ్యముచేఁ బరీక్షించియే యంగీకరింపుఁడు." ఈవిధముగా మతవిషయములనుగూర్చి యాతఁడొకవిధమైన హేతుదృష్టిని లోకమునకుఁ బ్రదర్శించినాఁడు.

మూఢవిశ్వాసమునకును, నాస్తికతకును మధ్యేమార్గము ననుసరింపుఁడని యాతఁడుపదేశించినాఁడు. మూఢవిశ్వాసమన్ని ప్రశ్నలకును సమాధానములిచ్చును: నాస్తికత యేప్రశ్నలకును సమాధానములు లేవనును. అతివాదములగు నీరెంటిని విడిచి, మధ్యేమార్గమగు పరిశీలనదృష్టి నాతఁడు బోధించెను. నీవు కన్నులు తెరచి లోకమును జూచినపుడేమి చూచుచున్నావు; సమస్తము గతించిపోవుచున్నది: ప్రపంచము సంసారము: ప్రకృతియొక్క జ్ఞాపకరూపము, అత్యున్నత నాగరికతలును, శ్రేష్ఠతమ కళాస్వరూపములును, శిల్పనిర్మాణము

లును, సర్వమును మ్రింగివేయు వినాశలక్షణమును గర్భమునం దాల్చియున్నవి. హేతునేత్రములతో లోకమును మనము మొదటఁజూచినప్పుడీ లక్షణము గోచరించును. అప్పుడాతఁడు ప్రశ్నించినాఁడు;" ఈయపరిపూర్ణతయను చీఁకటినుండి బయట పడి అమర్త్యత్వములేక నిర్వాణస్థితికిఁబోవుట కేదేనిమార్గ మున్నదా ?: "సంసారమునుండి నిర్వాణమునకుఁ దోడ్కొని పోవు తెన్నుగలదా ?" అప్పుడాతనికొక యతిపుంగవుఁడు కనపడి, ప్రశ్నింపఁగా, "ఓ నరపుంగవా! జన్మమృత్యుభీతవా - జన్మమృత్యుభయముచేత నేను శ్రమణుఁడనైతిని - ప్రకృతిో స్మిమోక్షాపేక్షయా - మృత్యుంజయత్వమును నేను పొందితిని, - నాకిక కాలమనినను, మరణమనినను - భయములేని పదవిని గాంచితినని చెప్పుకొను సామర్థ్యమునిచ్చు సన్యాసాశ్రమమును స్వీకరించితిన"ని చెప్పినాఁడు. ఇదియే బుద్ధుఁడు చూచిన సుప్రసిద్ధ చతుర్విధ దృశ్యములలోను మొదటిది! కాలుష్యముల మధ్యమున నిష్కలుషమైన దానిని, మరణశీలముగల వస్తువులమధ్యమున,జావులేని దానినెట్లు మనము చూడఁగలము. బుద్ధునికా యతిపుంగవుఁడు ధ్యానసాధనములనేర్చి, జ్ఞాన సిద్ధిని ప్రసాదించెను. ఆతఁడట్లేచేసి, కృతార్థుఁడయ్యెను. ఒక అభినవతత్త్వజ్ఞుఁ డిట్లుచెప్పినాఁడు; "ఏకాకియై యున్నప్పుడు మానవుఁడేమిచేయునో అదియే యాతనిమతము. ఈయేకాంత క్షణములలోనే మానవుఁడు ప్రపంచఘోషనుండి నివృత్తి గాంచి, సుఖాసీనుఁడై, సత్యమును లేక సౌందర్యమును, లేక శ్రేయస్సునుగూర్చి తెలిసికొనుటకై తనసకల మానసికశక్తు

లను కేంద్రీకరించును. ఇట్టి క్షణములలోనే మనము సత్యమును దర్శింతుము. సెన్ పద్ధతిగల బౌద్ధమతమును జపాను అభ్యసించుటలో నాశ్చర్యములేదు. సెన్ అనఁగా ధ్యానము, మనము ధ్యానమువలననే, వస్తువుల పరమార్థస్వరూపమును దెలిసికొనఁగలుగుదుము. మానవుఁడు తన దేహ మానసబుద్ధులను నాచ్ఛాదనములఁ దాటి, యింకను లోనికిఁబోయినపుడు, వానికది గోచరించును. అచట నాతఁడు, కాలములోని పూర్వాపర భేదమునకుబదు లేకకాలస్థితిననఁగా శాశ్వతస్థితిని గాంచి నిర్వాణసిద్ధి నందఁగలఁడు.

పరమగతియైన నిర్వాణమనగానేమో, మనకు బుద్ధుఁడు భావాత్మకముగాఁ జెప్పియుండలేదు. బుద్ధుఁడే దానికి మార్గమును జూపఁగలఁడనియుఁ, బ్రతివ్యక్తియు దానికొరకై దీక్షతో కృషియొనర్పవలెననియుఁ జెప్పెను. మనకు మోక్షసిద్ధి నిచ్చు బుద్ధుఁడు లభింపకున్నచో, మనము కఠోరదీక్షతో దానికై సాధనచేసి, సత్యాన్వేషణ మొనర్చినచో సాధింపఁగలము. ఇది మనసులోనుంచుకొని బుద్ధుఁడు సత్యమును గూర్చి యెట్టినిర్వచన సూత్రములను నిర్మింపఁబూనలేదు. మఱియు నాతఁడు వాగతీతమైన సత్యము వచించుటయు నుపదేశించుటయు నెట్లనిపలికినాఁడు; "అనక్షరస్య ధర్మస్య శ్రుతిః కా, దేశనా చ కా ?". "నేనుమిమ్ము మార్గమునఁబెట్టి, యెటు'బోవలెనో మాత్రమే చెప్పెదను. అష్టాంగ ధర్మమార్గమునననుసరించి గమ్యస్థానమును జేరుఁడు." ఇదియే బుద్ధుఁడు తెల్పిన ఉపదేశము. గమ్యస్థానమును జేరక, దానికై సాధనము

చేయు ననుచరులలో విభేదబుద్ధిని బుట్టించుటకు మాత్రమే యుపయోగపడుసత్యమును గూర్చిన సూత్రప్రవచనమాతఁడు చేయ నిరాకరించినాఁడు.

నిజముగా మనలోఁ బెక్కుమందికి సత్యస్వరూపదర్శనము లభింపదు; లభించినవారు తిరిగి మనరంగమున కరుదెంచి, సత్యస్థితి స్వరూపములను మనకువర్ణించి చెప్పుట కవకాశములేదు. ఈకారణములచేతనే, యాతఁడు మనకిచ్చిన యుపదేశము;"పిడివాదములను బెట్టుకొనకుఁడు; త్రోవవెదకి కొనుఁడు; మీరు పరమావధి చేరఁగలరు." ఏనుఁగు రూపమెట్టిదో తెలిసికొన యత్నించిన గుడ్డివారు, తా మొక్కరేచూచిన ప్రత్యేకావయవమును గజముగాఁజెప్పిరిగాని, వారికి దృష్టిభాగ్యము ప్రసాదింపఁగా, దాము జూచిన భిన్నభాగదృశ్యములన్నియు నొక్కే సంపూర్ణ గజములోని వని గ్రహించిరి. అన్యమతవిశ్వాసములను, ఆధారములను మనము గౌరవించుట విధియని మనకనేక రూపములలో నూరిపోయఁబడినది. ఈవిధమైన భారతీయ దృక్పథముతోఁ బరిచయములేనివారికి, భారతదేశమును బాలించిన పృథ్వీశులు, మతాంతరులగు క్రైస్తవులకు 'చర్చిలు' మహమ్మదీయులకు 'మాస్కులు' పారసీకులకు, అగ్నిదేవాలయములు కట్టించియిచ్చి, పోషించిన విధమాశ్చర్యమును గలిగించును. మీజపానుదేశములో షింటోమతము, బౌద్ధమతమునున్నవి. ఇవి పరస్పరవిరోధముగలవికావు. రెండు మతముల చిహ్నములొక్కే దేవాలయములో నుండుటయుఁ గలదు. చైనాదేశములో టావొయ్ మతము, కాన్ఫ్యూషన్ మతము,బౌద్ధమతము మూడును

గలవు. భిన్న మానసికదృక్పథములలో నొకే మానవులే భిన్న మత ముల నంగీకరింతురు. వారు దేవునారాధింపఁ గోరుదురు; వారి కత్యంత సమీపమున నున్న దేవుని దర్శింతురు. ఈ కారణముల చేతనే, ప్రాచ్యమతదృష్టికలిగిన మీాపశ్చిమదేశములలో, వివిధ మతసౌందర్యమునకై వాంఛించు నభిలాషను వ్యక్తపఱచు చున్నారు. ఆధునిక వైజ్ఞానికవిమర్శలమూలమున, నితరమతములు గూడ నిట్టి నిశ్చయము వైపునకే పయనించుచున్నవి.

దేవుఁడు మోజెస్‌కు గోచరించి, తనకు శత్రువులుండ రాదనియు నితర దేవత లందరను నిరసనభావముతోఁ జూడవలె ననియు బోధించినట్లు చెప్పనగును. ఇది యొకవిధమగు ధర్మ దీక్షయని తలపఁబడెను. కాని యితర మహాప్రవక్తలైన, ఏమస్, సీహె, ఈశయ్య, మున్నగువారు విశ్వకల్యాణప్రదములగు న్యాయ్య ధర్మములే ప్రధానము లని చెప్పిరి. ఈప్రజలందరు ధర్మ మార్గమున వినయ వినమితోత్తమాంగులై నడచుటయే తప్ప దేవునికి మఱేమి కావలయును? క్రైస్తవ ప్రపంచమున నేటి విజ్ఞాన వేత్తలుమాత్రము స్వాభిమానపూరితమైన యిట్టి పాక్షికవాద ములకుఁ దలలొగ్గుట మానిరి. చరిత్రలో నొక ముహూర్తములో నేకొలఁదిమందికో సర్వేశ్వరసాక్షాత్కారము సంప్రాప్తించె నని యీావాదము చెప్పును. పరస్పర సమన్వయ శూన్యములైన వారి చేతలను గూర్చిన గాథలను వారు పేర్కొందురు. కాని అభినవ వైజ్ఞానికులు క్రైస్తవ మతములోని కేంద్రములైన ప్రాతి పదిక సత్యాంశముల నుగ్గడింప యత్నించు చున్నారు; అవేవన, "సత్యము మిమ్ము ముక్తుల నొనర్చును; మీాకు మోక్షము

వలయుచో సత్యమును దెలిసికొనుఁడు. మన అజ్ఞాననిద్రనుండి మేల్కొని, తిరిగి జ్ఞానముచేఁ బునర్జన్మమెత్తుమని జీసస్ కోరుచున్నాఁడు. "లెమ్ము! నిద్రనుండి మేల్కొనుము" "నీవు జ్ఞానహీనుఁడవై యున్నావు, నీదృష్టిని మార్చుకొని, బుద్ధిని సంస్కరించుకొనుము. అజ్ఞాన దశనుండి జ్ఞానదశకుఁ బోవుటే మత ప్రయోజనము; వస్తుస్వస్వరూప సత్యమును గూర్చి యింక నుత్కృష్టతరమగు విజ్ఞానమును, ప్రాకృత స్థితినుండి, తీక్ష్ణతరమైన భావసిద్ధిని గాంచుటే మతములోని సారము. సర్వమతములు వక్కాణించున దిదియే. మతముల మూలాధారమునకుఁ బోతిమేని మతమనగా పారమార్థికముగా నొక్కటే యను భావమే వ్యావహారిక ప్రపంచములో భిన్నరూపములలో వ్యక్తమగుచున్నది. మనము వక్కాణింపవలసినది భిన్నత్వముకాదు; ఈమతము లన్నియు నేమి సాధింప యత్నించుచున్నవో మనము తెలియవలెను. సక్రమమైన పరిణామమును జూచినచో, మన మొకమెట్టునుండి యింకొక మెట్టునకు గమనించుచు నేఁడు మనము మానవఘట్టము జేరితిమి; ఇదియే గమ్యస్థానమనుటకు వీలులేదు. మానవుఁ డింకను ముందునకుఁ బోవలసిన ఘట్ట మొకటి యున్నది. బుద్ధిఘట్టము నుండి ఆత్మఘట్టమునకును, న్యాయ్యమునుండి ఔదార్యమునకును, సిద్ధాంతజ్ఞానమునుండి కర్మాచరణదీక్షకును మనము పోవలసియున్నది. ఇట్టి విజ్ఞాన పరివర్తనము సంభవించినఁగాని, మానవుఁడు దాను నిర్ణయించుకొన్న గమ్యస్థానమును జేరు యాత్రను బూర్తిచేసిన వాఁడు కాఁజాలఁడు. పరిణామములోని యీమార్పు భౌతిక

మైనదికాదు; అది యాతని ధర్మదీక్ష, మానసిక జీవితమునకు సంబంధించినది. మనము పొందవలసిన అభ్యుదయము మానసిక రంగమునందే.

భారతీయ వైజ్ఞానికులు మనము పొందవలసిన గమ్యము బ్రహ్మజ్ఞానసిద్ధియందురు; మోక్షమునిచ్చు సత్యసందర్శన మని క్రైస్తవు లందురు; దైవమున కధీనులము కావలెనని మహమ్మద్ ప్రవక్త పలికి, తన్మూలముననే పూర్ణశాంతి చేకూరఁగలదని చెప్పెను. దేవుఁడు తన దూతను బంపనిదేశ మొక్కటియు లేద నియు నాతఁడు చెప్పెను. భగవంతు డనగా సర్వప్రాణికోటినిఁ బ్రేమించువాడనియు, శ్రద్ధాభక్తులతో సమీపించువాని కాతఁ డెదురేగి కాపాడుననియుఁ జెప్పఁబడెను. మనము పరిశుద్ధహృద యులమైనచో; మతములను గూర్చిన శుష్కపాండిత్యము గాక, నిజముగా మనము నిశ్చయ విశ్వాసవశులమై, మనవ్యక్తిత్వము మార్పునొంది, ఉజ్జ్వలమైనచో, సర్వమతమూల సత్యము మన కెఱుక పడిన దన్నమాట. గర్వము, అసహనము, స్వీయాధిక్య భావము, గలిగి, తనదికాక తక్కినమతము లన్నియుఁ దుడిచి వేయఁదగినవను నిశ్చయము గలవ్యక్తి నిక్కముగా మతాను యాయి కాఁజాలఁడు. ఇతరమతములన్నిటిని త్రోసిపుచ్చి, సర్వ మతాంతరులను నీమతములోఁ గలుపుకొను దృష్టి నీకున్నచో నీవింకను మతమన నేమో అర్థముచేసికొను స్థితికిరాలేదు. కాబట్టి ముఖ్యమైనది, సకలమతగౌరవము. నీ కాధ్యాత్మికమైన వినయ ముండవలెను. నీ కొక్కనికే దేవునిదర్శనము కలిగిన దనియు, సత్యమునంతను నీవే గ్రహించితి వనియు, నీవు తలఁచిన దేవుని

ధర్శనమునకై సర్వప్రపంచము నీమతమును స్వీకరింపవలె ననియు నొక గర్వము, దురహంకారము, నీకు బయలుదేరును. హిందూదేవుఁడుగాని, మహమ్మదీయదేవుఁడు గాని, బౌద్ధదేవుఁడుగాని లేఁడు. మన మందరమును నమ్ము దేవుఁడొక్కఁడే. ఆతఁడు ధర్మప్రేమస్వరూపి. ఈవిధమైన సిద్ధాంతమును మన మంగీకరించినచో, మనకు సోదర మైత్రి సిద్ధించు ననుటలో నాకెట్టి సంశయమును లేదు. మతము లన్నియు నొకదానితో నొకటి సహకరించి, పనిచేయునెడల నవి తమతమ ధర్మముల కనుగుణముగాఁ బెంపొందును.

సాహసమే జీవితమునకుఁ బ్రాణము. మతముకూడ నట్టి సాహసమార్గమును బట్టవలెను. మనమ్ము చేసినయెడల పిడివాదములను విసర్జించి, అభినవహేతుదృష్టి సమన్వితములగు నాదర్శములకు విరుద్ధము లైనవానిని విడిచిపుచ్చి, కేంద్రసత్యముల నారాధించు నిమిత్తమై మనము విశేషత్యాగము చూపవలసివచ్చును. ఆపని మనము చేయునెడల, మానసికాధ్యాత్మిక రంగమున నేకత్వము గల ప్రపంచమును మనము సుప్రతిష్ఠిత మొనర్చినవార మగుదుము. ఇదియే నేటిప్రపంచము కోరునది. నేఁడు నన్ను గౌరవించి నాచేఁ బ్రారంభముచేయించిన యీ సర్వమత సహకార సమాజము, నేనుజూపిన భావముల ననుసరించి, వినయ వివేకములతోఁ బురోగమనము చేయుదురని విశ్వసించుచున్నాను, అభివందనములు.

---